

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	42.6	40.0	42.0	41.0	38.0
కనిష్ఠం	32.0	30.0	29.0	29.0	30.0



సింహ వాహనంపై కామాక్షితాయి కనువిందు

బుచ్చిరెడ్డిపాళెం : ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డప్పుల చప్పుళ్లు.. వేదపండితుల మంత్రోచ్చరణ.. తరలివచ్చిన భక్తజనం నడుమ శనివారం రాత్రి కామాక్షితాయి సింహ వాహనంపై ఊరేగారు. జొన్నవాడలో అట్టహాసంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం తిరుచా ఉత్సవంలో స్వామిఅమ్మవార్లకు గ్రామోత్సవం జరిగింది. అనంతరం రాత్రి సింహ వాహనంపై కొలువుదీరిన అమ్మవారు భక్తులను కటాక్షిస్తూ ముందుకు కదిలారు. నిత్యాన్నదాన సదనంలో భక్తజనానికి భోజన వసతి కల్పించారు. కాగా, ఆదివారం రాత్రి హంస వాహనసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో గిరికృష్ణ తెలిపారు.

సింహవాహనంపై ఊరేగుతున్న కామాక్షితాయి

నమో వాయుపుత్ర!

● భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

జై శ్రీరామభక్తహనుమాన్ మహారాజ్‌కీ జై.., జై హనుమాన్.. జైజై హనుమాన్.. నామస్మరణలతో శ్రీరామ, శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామి మందిరాలు మారుమోగిపోయాయి. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉదయం పంచామృతాభిషేకాలు, హోమాలు, విశేష అలంకరణ పూజలు, లక్ష తమలపాకులతో సామూహిక పూజలు, లక్ష మల్లెల అర్చనలు, అన్నదానాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవలతోపాటు పల్లకీ సేవలు కనుల పండువగా జరిగాయి. నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు జరిగాయి. హోమం అనంతరం భక్తులతో సామూహిక లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం పూర్ణాహుతి హారతులు, అన్నదానం జరిగింది. సాయంత్రం పిల్లలకు వెండి ఆంజనేయుడి డాలర్‌తో కంకరణధారణ, గ్రామోత్సవం, పల్లకీసేవలు జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)



నెల్లూరు : శబరి శ్రీరామక్షేత్రంలో లక్ష మల్లెల అర్చన



కార్యసిద్ధి ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన



సంగం : విశేష అలంకరణలో వీరాంజనేయుడు

పాతాళానికి భూగర్భ జలం

నెల్లూరు రూరల్, జూన్ 1 : జిల్లాలో భూగర్భ జలమట్టం ఆందోళనకరంగా మారింది. జిల్లా అంతట నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, మితిమీరిన ఎండలు ఇందుకు కారణంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గడిచిన మే నెలలో భూగర్భ జలమట్టం సరాసరిన 7.09 మీటర్ల లోతున ఉంది. ఏప్రిల్‌లో 6.5 మీటర్లుగా నమోదైంది. నెల వ్యవధిలోనే దాదాపుగా మీటరు మట్టం తగ్గిపోయింది. గతేడాది మే నెలలో 5.37 మీటర్లుగా మట్టం లెక్కగట్టారు. అదికాస్త నవంబరుకు 6.92 మీటర్లుగా నమోదైంది. తగ్గుతూ వస్తున్న భూగర్భ జలమట్టంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తుండగా రుతుపవనాల రాకతో ప్రజలంతా వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నారు. కాగ గాలిలో తేమ శాతం మరింత ఆందోళనకరంగా మారింది. శనివారం సాయంత్రం 5 గంటలకు గణాంక శాఖ అందించిన వివరాలు మేరకు గరిష్ఠంగా ముత్తుకూరులో 75.9 శాతం ఉండగా కనిష్ఠంగా ఏఎస్ పేటలో 52.5 శాతం నమోదైనట్లు లెక్కగట్టారు. కాగ గాలిలో ప్రయాణ వేగం గణనీయంగా తగ్గి ఉదయగిరిలో 3 మీటర్ల ఎత్తులో 13.6, 10 మీటర్ల ఎత్తులో 15.27 కి.మీ వేగం గరిష్ఠంగా నమోదవగా కనిష్ఠంగా ఉలవపాడులో 3.10 మీటర్ల ఎత్తులో 3 కి.మీ వేగం నమోదైంది. దీనివల్ల ఊపిరాడని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

లోకల్ మార్కెట్ ముంచేసింది!

ఈసారి బయట నుంచి ఎక్స్‌పోర్టు వ్యాపారులు ఉలవపాడు మామిడి కొనుగోలుకు సుముఖంగా లేనందున ధర పడిపోయింది. నా సొంతంగా 50 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు, భాగస్వాములతో కలిసి మరో 150 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. కాపు తక్కువైనా బయట వ్యాపారులు వస్తే గిరాకీ పెరిగి మంచి ధర వస్తుందని అనుకున్నారు. కానీ లోకల్ మార్కెట్‌తో ధరలు లేక నష్టపోవాల్సి వచ్చింది.

- పందిళ్ల ప్రసాద్, మామిడి కౌలు రైతు, మన్నేటికోట గ్రామం

మా మామిడి వైపు చూసేవారేరీ!?

మూడేళ్లుగా కౌలుకు తీసుకొని మామిడి సాగు చేస్తున్నా. ప్రతిసారీ నష్టాలే వస్తున్నాయి. ఈ ఏడాది కాపు తక్కువ కావడంతో డిమాండ్ పెరిగి చివరి దశలో టన్ను అధిక రేటు పలుకుతుందనుకున్నా. వాతావరణం తేడాగా ఉండటంతో పక్వానికి వచ్చిన కాపు వచ్చినట్లే లోకల్ వ్యాపారులకు అమ్మాల్సిన పరిస్థితి. బయటి వ్యాపారులు ఉలవపాడు మామాడి వైపు కన్నెత్తి చూడకపోవడమే ఇందుకు కారణం.

- అమ్మనబ్రోలు రమేష్, మామిడి కౌలు రైతు, కొల్లూరుపాడు

బయటివ్యాపారులే రాలేదు!

ఏటా బయట నుంచి ఎక్స్‌పోర్టు వ్యాపారులు వచ్చి చుట్టు పక్కల మండలాల మామిడి తోటల్లో కాపు చూపించి కొనుగోలు చేయించినందుకు బ్రోకరైజ్ వచ్చేది. కానీ, ఇప్పుడు గుంటూరు, విజయవాడ, ఇనమలమెట్లూరు, ఒంగోలుకు చెందిన లోకల్ వ్యాపారులు మాతో పనిలేకుండానే నేరుగా రైతుతో మాట్లాడుకొని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంపాదన కష్టమైందనే చెప్పాలి.

- సయ్యద్ దాదావలి, దళారి, ఉలవపాడు



ఫలరాజును కొనేవారేరి!?

- ముఖంచాటేసిన ఎగుమతి వ్యాపారులు
- ఈ ఏడాది రాష్ట్రం దాటని మామిడి
- స్థానికంగా పెరగని ధరలు
- నష్టాల ఊబిలో లీజుదారులు

ఉలవపాడు, జూన్ 1 : మే నెల మధ్య నాటికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మామిడి ఎగుమతి వ్యాపారులు, దళారులు, రైతులతో ఉలవపాడులో హడావుడి ఉండేది. దళారులు కూడా వ్యాపారుల వెంటే ఉండి వారికి అవసరమైన సరుకును చూపించి పర్సంటేజీ ద్వారా రూ.లక్షలు సంపాదించే వారు. కాపును జాగ్రత్తగా సంరక్షిస్తూ వచ్చిన మామిడి రైతులకు బయట వ్యాపారులు వచ్చారంటే అదొక మనోధైర్యం. అయితే, ఈ ఏడాది మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వాతావరణంలో ఏర్పడిన పరిస్థితుల కారణంగా సకాలంలో పూతలు వేయలేదు. అదును తప్పి వేసిన పూతకు పిందెలు నిలబడలేదు. వచ్చిన అరకొర దిగుబడికి కూడా ధర లేకపోవడంతో సాగుదారులు దిగాలు చెందుతున్నారు. బయటి వ్యాపారుల రాకతో ఫలాల రేటు పెరుగుతుందని ఆశలు పెట్టుకున్నా అడియాసే అయ్యింది. ప్రతి ఏడాది మే నెల వచ్చే సరికి ఉలవపాడు దాని చుట్టు పక్కల మండలాల నుంచి మామిడి కాపు పక్వానికి వచ్చి ఎగుమతికి అందుబాటులోకి వస్తుంది. హైదరాబాద్, సూర్యాపేట, చెన్నై, విజయవాడ, గుంటూరు, నెల్లూరు నుంచి వ్యాపారులు వచ్చి మామిడి సీజన్ అయ్యే వరకు ఉలవపాడులోనే మకాం వేస్తారు. ఉలవపాడు కేంద్రంగా గుడ్లూరు, సింగరాయకొండ, కావలి, వింజమూరు ప్రాంతాల నుంచి మామిడి కొను గోలు చేసి వందల టన్నులు ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అలాంటిది ఈ ఏడాది బయట వ్యాపారులు ముఖం చాటేశారు. స్థానిక పరిస్థితులను బట్టి నాణ్యమైన కాయలు టన్ను రూ.50 వేల నుంచి 55 వేలు వరకు పలకగా, ఒక రకమైన కాయలు టన్ను రూ.40 వేలు మాత్రమే అమ్ముడు పోతోంది. అదే ఎగుమతులు జోరుగా జరిగి ఉంటే ఈపాటికి టన్ను రూ.60 వేల నుంచి 70 వేల వరకు పలుకుతుండేది.

● కోత పనులు కరువైన వైనం

మామిడి ఎగుమతులు జోరందుకున్న వేళ కోత కూలీలకు రెండు నెలల పాటు ఉపాధి లభించేది. చెట్లకు ఉన్న కాయల నాణ్యత దెబ్బతినకుండా కోయడంలో నేర్పరితనంతో కూలి రేట్లు కూడా బాగానే ఉండేది. రాసి పోసిన కాయలను గ్రేడింగ్ చేసే పని, బాక్సులకు పేర్చు పని, లారీలకు లోడ్ చేసే పని ఇన్ని రాకాలుగా ఉపాధి పొందే కూలీలకు ఈ ఏడాది కరువునే మిగిల్చింది. ఉలవపాడు హైవేపై మూడు లారీ కాటాలు ఉన్నాయి. 24 గంటలు విద్యుత్ దీపాల వెలుతురులో వాహనాలకు లోడు, అన్‌లోడు చేస్తూ తీరిక లేకుండా ఉండేది. అలాంటిది ఇప్పుడు ఆ కాటాలన్నీ బోసిపోయి ఉన్నాయి.



మన్నేటికోట అడ్డరోడ్డు లారీ కాటా వద్ద హడావిడి కనిపించని మామిడి గ్రేడింగ్


● స్థానిక మార్కెట్టే దిక్కు

ఈసారి సాగుదారులకు స్థానికంగా ఉంటున్న చిరు వ్యాపారులే దిక్కు అయ్యారు. బాపట్ల, వేటపాలెం, చీరాల, చినగంజాం, ఒంగోలు నుంచి ఉదయం రైలులో ఉలవపాడుకు వచ్చి మార్కెట్‌లో కొనుగోలు చేసిన మామిడిని ట్రేలలో సాయంత్రం తిరుగు ప్రయాణంలో రైలులో వెళ్తుంటారు. ఈ ఏడాది ఇప్పటికే 80 శాతం మామిడి స్థానిక మార్కెట్, హైవేపై అంగళ్ల ద్వారా వ్యాపారం జరిగింది. మరో రెండు వారాలు మాత్రమే మామిడి దిగుమతి ఉంటుంది.

'హౌసింగ్'పై నిఘా

తిలాపాపం తలాపిడికెడు అన్న విధంగా పేదల సొమ్మును వైసీపీ నేతలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు బొక్కేశారు. జగనన్న కాలనీల మాటున జరిగిన ఈ భారీ అవినీతి వెలుగులోకి వస్తోంది. ప్రభుత్వంలోని పెద్దలు, ఉన్నతాధికారులు కూడా ఈ అవినీతిలో భాగస్వామ్యం ఉండడంతో ఎవరి వారు పట్టీపట్టనట్టు వ్యవహరించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉన్నట్లు ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో జాయింట్ కలెక్టర్ ఈ కుంభకోణంపై విచారణ జరిపి వాస్తవాలను ప్రభుత్వానికి పంపినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ క్రమంలో జిల్లాలోని హౌసింగ్ అధికారుల అవినీతిపై కొందరు ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదులు చేశారు. ముగ్గురు అధికారులు, ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పేర్లను ప్రస్తావిస్తూ, వారు చేసిన వ్యవహారాలను కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో దర్యాప్తు సంస్థలు బొక్కిన వారి గుట్టు రట్టు చేసేందుకు రంగంలో దిగాయి.

- కాలనీల పేరుతో భారీ అవినీతి
- ఇళ్ల నిర్మాణాలకు లెక్కాపక్కాలేని వైనం
- మొదటి నుంచీ పట్టించుకోని ప్రభుత్వం
- ముగ్గురు అధికారులపై ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదులు
- ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగే బ్రోకర్..!
- నిగ్గు తేల్చేందుకు రంగంలోకి దిగిన నిఘా సంస్థలు



వెంకటేశ్వరపురం లేఅవుట్‌లో నాసిరకంగా నిర్మించిన ఇళ్లు

నెల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు 97,121 ఇళ్లు మంజూరవగా ఇప్పటివరకూ 22 వేల ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. అందులో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి సంఖ్యనే 12 వేలకు పైగా ఉంది. ఈ ఇళ్లలోనూ మూడొంతులు నిర్మించకుండానే పాత ఇళ్లను చూపించి బిల్లులు తినేశారు. ఇందుకు సంబంధించిన అనేక ఆధారాలు గతంలోని వెలుగులోకి వచ్చాయి. ఒక ఇంటి నిర్మాణం మొదలై బిల్లులు మంజూరు కావాలంటే అందుకు పలు దశలున్నాయి. బేస్‌లెవల్, లింటెల్ లెవల్, రూఫ్‌కాస్ట్‌లెవల్, కంప్లీట్.. ఇలా ప్రతి దశలోనూ అధికారులు పరిశీలించి ఎంబుక్ రికార్డు చేసిన తర్వాతనే లబ్ధిదారుడి ఖాతాల్లో బిల్లులు జమవుతాయి. ప్రతి సందర్భంలోనూ ఇంటి స్థలంలో జియో ట్యాగింగ్ చేస్తూ ఇంటి ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ స్థలంలో కాకుండా మరో స్థలంలో నుంచి జియోట్యాగింగ్ చేస్తే అక్షాంశాలు, రేఖాంశాలు సరిపోలవు. దీనిని వెబ్‌సైట్ తిరస్కరిస్తుంది. కాబట్టి కచ్చితంగా లబ్ధిదారుడి స్థలంలోని ఇంటినే ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ కారణంగానే చాలా ఇళ్లకు బేస్ లెవల్ సందర్భంలోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, లింటెల్ లెవల్‌లోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, రూఫ్‌కాస్ట్ లెవల్‌లోనూ అదే ఫొటోను అప్‌లోడ్ చేశారు. ఇక్కడ అక్రమార్కుల బండారం బయటపడింది. ఈ నిర్మాణాలను ఏఈలు నేరుగా పరిశీలించాలి. డీఈలు కనీసం 30 శాతం, ఈఈలు పది శాతం ఇళ్లను తనిఖీ చేయాలి. కానీ వారు ఈ అక్రమాలను పట్టించుకోలేదు. వారికి కూడా భాగం ఉండబట్టే చూసీచూడనట్లు వదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఇంటి గోడల మధ్య తేలిపోతున్న రాళ్లు

● అంతా ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగే!

గృహ నిర్మాణ శాఖ జిల్లా కార్యాలయంలో ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగే జిల్లాలో జరిగిన కుంభకోణంలో ప్రధాన సూత్రధారి అని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై మొదటి నుంచీ ఆరోపణలు వస్తున్నా అధికారులెవరూ పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లకు, అధికారులకు మధ్యవర్తిగా వ్యవహరిస్తూ పేదల సొమ్మును దిగమింగినట్లు ఫిర్యాదుల్లో ఆరోపించారు. అనంతసాగరానికి చెందిన ఓ అనుభవం లేని వ్యక్తికి రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 70 వేలకు పైగా ఇళ్లను అప్పగించారు. దీని వెనుక కూడా ఆ ఉద్యోగిపై నుంచి కింది వరకు రాయభారాలు నడిపినట్లు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం హౌసింగ్ కార్యాలయంలో పనిచేస్తూనే సదరు కాంట్రాక్టర్ వద్ద కూడా ఆ ఉద్యోగి పనిచేస్తున్నట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మూడేళ్లలో ఆ ఉద్యోగికి రూ.కోట్లకు పడగలెత్తారని చెప్పుకుంటున్నారు. ఈ ఉద్యోగిని విచారించి కూపీ లాగితే అసలు వాస్తవాలన్నీ బయటకు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● ఆ ముగ్గురిపై ఫిర్యాదులు

జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను దగ్గర చేరి పరిశీలిస్తే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో ఇట్టే అర్థమవుతుంది. గోడలను చేతితో నెమిరితేనే ప్లాస్టింగ్ రాలిపోతోంది. ఇళ్లు పూర్తయినట్లుగా బయటకు రంగులు వేసి బిల్లులు తినేశారు. కానీ లోపల మాత్రం కనీసం దళం కూడా వేయలేదు. అసలు ఆప్షన్-3 కింద ఎంత మంది లబ్ధిదారులు ఆమోదం తెలిపారు? ఇప్పటి వరకూ ఎవరెవరికి ఇళ్లు నిర్మించి ఇచ్చారు? వాటిల్లో ఎంత మంది కాపురాలు ఉంటున్నారు? అన్న వివరాలేవీ అధికారుల వద్ద లేవు. ఆప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలను అధికారులే కాంట్రాక్టర్లకు అప్పగించి ఇప్పుడు తమకు సంబంధం లేదని మాట్లాడుతున్నారు. ఆ కాంట్రాక్టర్లు తీసుకున్న మెటీరియల్, బిల్లులకు నిర్మించిన ఇళ్లకు పొంతన కుదరడం లేదు. ఇదే అదునుగా హౌసింగ్‌లో పనిచేస్తున్న సిబ్బంది కూడా సిమెంటు, స్టీలు అమ్మేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంగంలో ఇది బయటపడింది కూడా. హౌసింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ ముగ్గురు అధికారుల తీరు మొదటి నుంచీ వివాదాస్పదంగా ఉంది. ఓ బాధ్యత కలిగిన అధికారి అన్నీ తెలిసినా తన వాటా తీసుకొని మిన్నకుండిపోతున్నారని ఏసీబీ, విజిలెన్స్‌కు అందిన ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అలానే డీఈ కోవూరు మండలం పడుగుపాడు వద్ద మూడంతస్తుల ఇంటిని, మరో ఏఈ హరనాథపురంలో ఐదంతస్తుల ఇంటిని పేదల ఇళ్ల సిమెంటు, స్టీలు, ఇసుకతో నిర్మించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఒక్కో అధికారి గడిచిన మూడేళ్లలో రూ.కోట్లు సంపాదించారని, వీరిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అందులో కోరారు.



ప్రజలకు ఉపయోగంలో లేని సొసైటీ కాలనీలోని బావి



క్రిష్టియన్‌పేటలో నిరుపయోగంగా మున్సిపల్ బావి

అడుగంటుతున్న భూగర్భ జలాలు

● నిరుపయోగంగా మున్సిపల్ బావులు ● తాగునీటికి ప్రజల ఇక్కట్లు

కావలిటౌన్, జూన్1: ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పట్టణ పరిధిలోని బావుల్లో నీరు అడుగంటిపోయి మోటార్లకు అందడంలేదు. బోర్లలో సైతం నీరు ఇంకిపోయి బురద రావడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పట్టణంలో సగానికి పైగా ప్రాంతాలు మున్సిపల్ ట్యాంకర్లపైనే ఆధారపడక తప్పడంలేదు. రోజు మార్చిరోజు ట్యాంకర్లు నీరు సరఫరా చేస్తుండంతో ఇళ్ల ముందు డ్రమ్ముల్లో నీరు పట్టుకుని పొదుపుగా వాడుకుంటున్నారు. ట్యాంకర్లతో సరఫరా చేసే నీరు తాగేందుకు అనువుగా లేకపోవడంతో ఆర్‌వో నీరు బబుల్స్ కొనుగోలు చేసుకోక తప్పడంలేదు. ఒక బబుల్ రూ. 20చొప్పున రోజుకు ఇంటికి కనీసం రెండు బబుల్స్ కొనుగోలు చేసుకుంటే నెలకు రూ.1200 త్రాగునీటికి ఖర్చు చేస్తున్నారు.

● నిరుపయోగంగా మున్సిపల్ బావులు

ప్రజల తాగునీటికి, వాడుకునే నీటి అవసరాలకు అప్పటి పాలకులు పట్టణంలో సుమారు 80కిపైగా మున్సిపల్ బావులు ఏర్పాటు చేయించారు. అప్పట్లో పట్టణ ప్రజలందరూ ఆ బావుల్లోని నీటినే తాగేందుకు వాడుకునేవారు. పట్టణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం జరిగి మున్సిపల్ కుళాయిలు అందుబాటులో వచ్చాక మున్సిపల్ బావుల వాడకం తగ్గింది. అంతేకాక నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి. దీంతో బావుల్లో పూడిక చేరి, చెట్లు మొలిచి నీరు కలుషితమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి బావుల్లో పూడిక తీయించి, నీటిని శుద్ధి చేసి ఉపయోగంలోకి తెస్తే కొంతవరకైనా ప్రజల దాహార్తి తీరే అవకాశం ఉంది. బావులు నిరుపయోగంగా మారడంతో సగానికిపైగా అన్యాక్రాంతమయ్యాయి. వీటిని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కచ్చేరిమిట్టలో ఉపయోగంలో లేని బావి



బ్లాసింగ్‌తో సుద్దబండలను పగులకొట్టి, మట్టిని తోలిన ప్రాంతం



భూమిలోపల తెల్లరాయిని కనుగునేందుకు వేసిన బోరు

తెల్లరాయి కోసం అక్రమ బ్లాస్టింగ్‌లు

మర్రిపాడు, జూన్ 1: శెట్టిసముద్రం రెవెన్యూ పరిధిలోని ఖాదర్‌పూరు గ్రామ పరిసరాల ప్రభుత్వ పొలాల్లో అక్ర మార్కులు తెల్లరాయి కోసం తవ్వకాలకు బ్లాస్టింగ్ జరిపారు. అధికారులు ఎన్నికల కౌంటింగ్ పనుల్లో ఉండగా మూడురోజుల నుంచి రాత్రుల సమయాల్లో బ్లాస్టింగ్‌లు జరిపి సుద్దబండలను పగులకొట్టి జేసీబీలతో సుమారు 10అడుగుల లోతు మట్టిని పక్కకు తొలగిస్తున్నారు. బ్లాస్టింగ్‌తో వచ్చే శబ్దాలతో ఖాదరపూరు గ్రామస్థులు నిద్రపట్టక భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో భూమిలోపల తెల్లరాయి ఉన్నట్లు గతంలో బోరుబావులతో గుర్తించారు. దాంతో గుట్టుచప్పుడు కాకుండా అక్రమ తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేసి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మనుబోలు, జూన్ 1: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం వేకువజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జట్లకొండూరుకు చెందిన కూలీలు కట్టెపనికి ట్రాక్టర్‌లో వెళుతుండగా వీరంపల్లి క్రాస్‌రోడ్డు మలుపు తిరుగుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వెళుతున్న ప్రైవేట్ అంబులెన్సు ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో అంబులెన్సు డ్రైవర్ సురేష్, ట్రాక్టర్ డ్రైవర్ వేణు, కూలీ శీనువాసులుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముగ్గురిని 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.



ట్రాక్టర్‌ను ఢీకొన్న అంబులెన్సు

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

బుచ్చిరెడ్డిపాళెం : ఎండవేడిమి తట్టుకోలేక ఇస్కపాళెం పరిధిలోని వడ్డిపాళెం గిరిజనకాలనీకి చెందిన పోట్లూరు బుర్రెమ్మ (78) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందింది. ఎండల తీవ్రతతో శుక్రవారం వడదెబ్బకు గురైన బుర్రెమ్మ శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

హోంగార్డును దుర్భాషలాడిన కేసులో రెండేళ్ల జైలు

ఉదయగిరి రూరల్, జూన్ 1: జీ.అయ్యవారిపల్లి పోలింగ్ కేంద్రంలో 2019లో జరిగిన ఎన్నికల పోలింగ్ కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న మహిళా హోంగార్డును దుర్భాషలాడిన కేసులో పెరుమాళ్ల తిరుపతయ్యకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య శనివారం తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. దేకూరుపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ల తిరుపతయ్య మద్యం సేవించి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో పాటు హోంగార్డును దుర్భాషలాడి నెట్టడం జరిగిందన్నారు. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైందన్నారు.

కావలి కోర్టు వీధిలో చోరీ

● ఏడు సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

కావలి రూరల్, జూన్1: పట్టణంలోని కోర్టువీధిలో గల ఓ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు ఆభరణాలను దొంగిలించుకు పోయినట్లు బాధితురాలు కాకుటూరి వెంకటరమాదేవి శనివారం ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు వృద్ధురాలు అయిన వెంకటరమాదేవి, ఆమె భర్త సుబ్రహ్మణ్యం శుక్రవారం రాత్రి ఇంట్లో పడుకుని, ఉక్కపోతకు తట్టుకోలేక గాలి కోసం ఇంటి తలుపులు తీసి నిద్రపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి వంట గదిలో దాచి ఉంచిన ఏడు సవర్ల బంగారు ఆభరణాలను దొంగిలించుకు పోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ సీఐ రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు ఎస్‌ఐ జమాల్‌వల్లీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	161
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6850
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ. 95.10

కలిగిరిలో కిలో పొగాకు రూ.350

కలిగిరి, జూన్ 1: రోజురోజుకి పొగాకు ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో కిలో రూ.230తో ప్రారంభమై గత నెలాఖరుకు రూ.300 వరకు చేరింది. అయితే ధరలు రోజురోజుకి పెరుగుతూ ఒక్క సారిగా రూ.350కి చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 704 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 15కంపెనీల ప్రతినిధులు పాల్గొని 593బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-76, ఆర్‌ఆర్-5, సీఆర్-23 జంపింగ్ లాట్స్-7 కారణాలతో 111బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.350, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.300.83గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

వామ్మో.. ఎండ!

● ఉదయం నుంచే భానుడి భగభగలు ● 4వ తేదీ వరకు ఇదే పరిస్థితి

● వాతావరణ శాఖ వెల్లడి ● ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద నిర్మానుష్యంగా ఉన్న ఫ్లైవోవర్ బ్రిడ్జి

నెల్లూరు(వైద్యం), జూన్ 1 : గతంలో ఎన్నడూ లేనివిధంగా వేసవి తీవ్రత ఎక్కువై ప్రజలను ఆందోళనలకు గురిచేస్తోంది. ఈశాన్య రుతు పవనాలు మరో నాలుగు రోజుల్లో వస్తాయని భావిస్తున్న జిల్లా ప్రజలపై వాతావరణ శాఖ పిడుగులాంటి ప్రకటన చేసింది. ఈ నెల 4వ తేదీ వరకు వేసవి తీవ్రత 45 డిగ్రీలు దాటే అవకాశం ఉంటుందని వెల్లడించడం, తాజాగా మహారాష్ట్ర లోని నాగపూర్‌లో ఏకంగా 56 డిగ్రీలు నమోదవడంతో వేసవి తీవ్రత కలవరపెడుతోంది. అలాగే మూడు రోజుల క్రితం ఢిల్లీ రాజధానిలో 52 డిగ్రీల నమోదైంది.. జిల్లాలోనూ వేసవి తీవ్రత ఇప్పటికే 44 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక చాలా మంది బయటకు రావడానికే భయపడుతున్నారు. ఒకవైపు ఉక్కపోత, మరో వైపు వేడి గాలులు వృద్ధులు, పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాత్రి సమయంలో సైతం వేడి ఎక్కువగా ఉంటుండడం కలవరపెడుతోంది. సిమెంట్ రోడ్లు నుంచి వేడి ఎక్కువై ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనికితోడు కరెంటు కోతలు ఉండడంతో గ్రామాల్లో ఎక్కువగా బయట చెట్ల నీడలోనే గడపాల్సి వస్తోంది. ఇదిలాఉంగా దేశవ్యాప్తంగా ఈ ఉష్ణోగ్రతలతో 79 మంది మృత్యువాత పడగా అందులో 25 మంది ఎన్నికల సిబ్బంది ఉండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోనూ ఇప్పటికే 5 మంది మృత్యువాత పడగా ఎంతోమంది వడదెబ్బకు గురై పలు ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్నారు. ఈ క్రమంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని ఒక వేళ అత్యవస పరిస్థితులు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా గతంతో పోలిస్తే ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయి. నెల్లూరు నగరం, కావలి, ఆత్మకూరు, కందుకూరు పట్టణాలలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తీవ్రతను తట్టుకోలేక ఎక్కువగా ఏసీలు, ఫ్రిజ్ వినియోగం ఎక్కువైంది. ఈ పరిస్థితిలో వాటి ద్వారా వెలువడే క్లోరోఫ్లోరో కార్బన్‌లు గాలిలో తేమశాతాన్ని తగ్గిస్తోన్నాయి.

వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలి



ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో పాటు వేడి గాలులు వీస్తున్నాయి. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. అనారోగ్య బాధితులు, ఆరోగ్యవంతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి

జాగ్రత్తలు పాటించాలి

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు మహిళలు ముఖానికి సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి.
- చర్మంపై తేమ ఉండేలా నీరు కలిపిన మాయిశ్చరైజింగ్ క్రీమ్‌ను రాసుకోవాలి.
- పెద్ద టోపీలను ధరించడంతోపాటు కళ్లకు చలువ అద్దాలు పెట్టుకోవాలి.
- ఎండకు శరీరం విడుదల చేసే చెమటను బాగా పీల్చగలిగే వదులు దుస్తులు ధరించాలి.
- గర్భిణులు కడుపులో బిడ్డ ఇబ్బంది పడకుండా వీలైనంత వదులుగా దుస్తులు ధరించాలి
- గొడుగులతో సూర్యకిరణాల నుంచి కాపాడుకోవచ్చు.
- ఎక్కువగా ద్రవహారం తీసుకోవాలి.
- పండ్లరసాలతో పాటు జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకుంటే మంచిది.
- నిమ్మకాయ, ఉప్పు కలిపిన నీటితో డీ హైడ్రేషన్ నుంచి ఉపశమనం పొందవచ్చు.
- ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కాయకూరలు, బీన్స్, నట్స్, గుడ్లు, తృణధాన్యాలు, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి.
- కొబ్బరి నీరు తీసుకుంటే వేసవి తాపం నుంచి ఉపసమనం లభిస్తోంది.
- చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళితే పండ్లరసాలు తీసుకెళ్లాలి.
- తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు ఉండేలా చూసుకోవాలి.
- ఎలక్ట్రోలైట్ ద్రావణాలు కూడా వెంట తీసుకువెళితే ఎంతో ప్రయోజనం.
- వేసవి కాలంలో బయట తిరిగేటప్పుడు ఉల్లిపాయపై తొక్కు తీసి దాన్ని ప్యాంట్ జేబులో, మహిళలు వ్యానిటీ బ్యాగ్‌లో ఉంచుకుంటే వడదెబ్బ తగలదని నిపుణులు అంటున్నారు. ఇది మంచి ఔషధమైనందున చిన్నపిల్లల చొక్కాల్లో సంగం కోసి ఉంచితే మంచిది. ఇందులో ఎన్నో గుణాలు ఉన్నాయి. ఉల్లిగడ్డ అని చులకనమాత్రం చేయొద్దని నిపుణులు అంటున్నారు.

వచ్చే మూడు రోజులు జాగ్రత్త



వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వచ్చే మూడు రోజులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరిగితే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే వేసవి తీవ్రత వల్ల అనేక మంది రోగులకు జీజీహెచ్‌లో చికిత్సలు అందిస్తున్నాం. అత్యవసరమై బయటకు వస్తే నీళ్ల బాటిల్ అందుబాటులో ఉంచుకోవాలి.

- డాక్టర్ గంగాధర్, జనరల్ ఫిజిషీయన్, జీజీహెచ్

మలేరియా రహిత సమాజం కోసం సమష్టి కృషి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెంచలయ్య

● మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూన్ 1 : మలేరియా రహిత సమాజం కోసం సమష్టి జరగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పిలుపు నిచ్చారు. శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి బోసుబొమ్మ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రాణాంతకమైన మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. మలేరియా వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వైద్య చికిత్సలు పొందాలని తెలిపారు. మలేరియా నివారణ జిల్లా అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో మలేరియా కంట్రోల్‌లోనే ఉందన్నారు. లార్వా దశలోనే దోమలను నివారించాలని, తద్వారా మలేరియా వ్యాధిని నియంత్రించవచ్చని వెల్లడించారు. వచ్చే వర్షాకాలంలో దోమలు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం మలేరియా రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా నివారణ జిల్లా అదనపు అధికారి నాగార్జునరావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరకు రెక్కలు!

డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకనే! ● భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం



పొదలకూరు, జూన్ 1 : వేసవి తాపం పెరుగుతుండటం నిమ్మకాయలకు రెక్కలొచ్చినట్టు అయ్యింది. జూన్ నెలలో నిమ్మ ధరలు తగ్గాల్సి వున్నా పెరుగుతుండటం విశేషం. గతంలో కిలో 20 నుంచి రూ.45 ఉండగా, ప్రస్తుతం రూ.45 నుంచి 70 వరకు పలుకుతోంది. పొదలకూరు నిమ్మ మార్కెట్‌లో లూజు (80 కేజీలు) రూ.4,500 నుంచి 6,500 వరకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఢిల్లీ, జైపూర్, ఆగ్రా, లక్నో, గోరఖ్‌పూర్, గయా, పాట్నా, రాంచీ, బీహార్, చెన్నై, కోయంబత్తూర్ వంటి ప్రాంతాలకు ఇక్కడ నుంచే నిమ్మకాయలను ఎగుమతి చేస్తున్నారు. పెరిగిన ఎండల నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గ సప్లయి లేదు. మిచాంగ్ తుఫాన్, వర్షాలు కారణంగా దిగుబడి తగ్గిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో స్థానికంగానే నిమ్మకాయలకు కరువు ఏర్పడింది. ఫలితంగా డిమాండ్ పెరగడంతో ముస్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.



ఆన్‌లైన్ సెంటర్ వద్ద పింఛనుదారుల పడిగాపులు

పెన్షన్ కష్టాలు..!

పెన్షన్ సొమ్మును కొందరికి బ్యాంకు ఖాతాలు, మరికొందరికి నేరుగా అందించడంతో పింఛనుదారులు అయోమయానికి గురయ్యారు. బ్యాంకు ఖాతాలు కలిగిన వృద్ధులు, చేనేత, వితంతు, ఒంటరి స్త్రీలు పింఛన్ సొమ్ము కోసం ఉదయం ఏడు గంటలకే ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల వద్దకు చేరిపోయారు. 11 గంటలైనా తమ ఖాతాలకు నగదు జమ కాకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. నగదు జమ అయ్యేటప్పటికి ఎండ వేడిమి భరించలేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- సంగం



ఎండ వేడిమి భరించలేక..

నేలటూరు అత్తిచెట్లకుంటలోని నీటిలో సేదతీరుతున్న మూగజీవాలు

ఉదయగిరి, జూన్ 1: ఎండల ప్రతాపం మనుషులకే కాదు మూగజీవాలు సైతం ఉంది. అధిక ఉష్ణోగ్రతలను అవి తట్టుకోలేక విలవిలలాడు తున్నాయి. ఏ మాత్రం నీటి వనరులు దొరికినా అందులో దిగి కాసేపు సేదతీరు తున్నాయి. శనివారం మండలంలోని నేలటూరుకు చెందిన ఎనుములు అత్తిచెట్లకుంటలో ఉన్న కొద్దిపాటి నీటిలోకి దిగి సేదతీరుతున్నాయి.

ఆమంచర్లలో జామాయిల్ 'పంచాయితీ'

● రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత ● వెంటనే విడుదల

నెల్లూరురూరల్, జూన్ 1 : అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన ఖరీదైన జామాయిల్ కలప రహస్యంగా తరలింపు వ్యవహారం శుక్రవారం రాత్రి ఆమంచర్ల వద్ద బట్టబయలైంది. వెంటనే రంగంలోకి దిగిన సదరు అధికారులు పంచాయితీ నిర్వహించి వెంటనే లోడైన రెండు ట్రాక్టర్లను ఒక ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసినట్లు సమాచారం గుప్పుమంటుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు... అమంచర్ల ప్రాంతంలో సాగు చేస్తున్న జామాయిల్ చెట్లలో ముదురు కర్ర కట్టింగ్ చేసిన అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించారు. కాగా కొన కర్ర అక్కడే ఉండడంతో దానిపై కన్నేసిన కొందరు వ్యక్తులు రంగంలోకి దిగి రెండు ట్రాక్టర్లకు లోడ్ చేసినట్లు ఈ ప్రాంతవాసులు కొందరు తెలిపారు. వీటిని పసికట్టిన ఓ అధికారి రంగంలోకి దిగి తొలత హడావుడి చేసి ఆపై కర్ర తరలింపుదారులతో పంచాయితీకి దిగగా వేలల్లో సొమ్ము డిమాండ్ చేసి ఆపై వదిలేసినట్లు ఆమంచర్ల వాసులు తెలిపారు. కొన కర్ర తరలింపుపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే అస్సలు విషయాలు బహిర్గతమవుతాయని అంటున్నారు. ఈ వ్యవహారం శనివారం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

సోమశిలలో 7.410 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూన్ 1: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. ఆదివారానికి 7.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిరంతర విద్యుత్ : సీఎండీ

నెల్లూరు (జడ్పీ), జూన్ 1: ఓట్ల లెక్కింపు కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ సంతోష్ రావు తెలిపారు. శనివారం కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన విద్యుత్ సరఫరాకు సంబంధించి జిల్లా అధికారులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. మూడు షిఫ్ట్‌లు ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. 220, 132, 33కేవీల సబ్‌స్టేషన్ల నుంచి నిరంతర విద్యుత్తు సరఫరా చేయడంతోపాటు ప్రత్యేకంగా అధికారులను పర్యవేక్షణకు నియమించినట్లు చెప్పారు. కౌంటింగ్ సమయంలో చిన్న సమస్య కూడా తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లును చేసేలా ఆదేశించామన్నారు. సీఎండీ వెంట ఎస్‌ఈ విజయన్, ఈఈలు గంగాదర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రియదర్శిని కళాశాలను సందర్శిస్తున్న సీఎండీ సంతోషరావు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు


కొండాపురం : భీమవరప్పాడులో ఆంజనేయుడికి పూజలు


కలిగిరి, కందుకూరుల్లో ప్రత్యేక అలంకరణలో పవన సుతుడు


కావలిటౌన్ : హనుమత్ క్షేత్రంలో సామూహిక లక్ష సింధూర అర్చన చేస్తున్న భక్తులు


వలేటివారిపాలెం : ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

కావలిటౌన్, జూన్1: పట్టణ పరిధిలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం హనుమత్ జయంతి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. ముసునూరు హనుమత్‌క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో వారంపాటు హనుమత్ జయంతి ఉత్సవాలు జరిగాయి. శనివారం ఉదయం 108 కలశాల స్థాపన, శాంతి అభిషేకాలు, హోమం పూజలు జరిగాయి. 11గంటలకు సామూహిక లక్ష సింధూర అర్చన పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదం అందచేశారు. దక్షిణంపేట రామాలయంలో జరిగిన పూజల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. జనతాపేట ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా ఉత్సవాలు జరిగాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. మద్దూరుపాడులోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి ట్రంకురోడ్డు మీదుగా ముసునూరులోని హనుమత్ క్షేత్రం వరకు సాగిన శోభాయాత్రలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. యాత్ర ముగింపు సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న అన్నదాత మణి (ప్రాసమణి) తనదైన శైలిలో ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

కావలి రూరల్ : మండలంలోని కొత్తపల్లి, సిరిపురం, చౌదరిపాలెం, గౌరవరం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలను, రామాలయాలను శనివారం హనుమజ్జయంతి సందర్భంగా విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో అలంకరించి, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించా రు.

అల్లూరు : మండలంలోని అన్ని ఆలయాల్లో శనివారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయం, మారుతీ ఆశ్రమంతో పాటు, నార్తుమోపూరులోని రామమందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో అన్నదా నం నిర్వహించారు.

బిట్రగుంట, (దగదర్తి) : దగదర్తి మండలం కాట్రాయపాడులోని హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. అంజనీపుత్రుడి సేవా కార్యక్రమంలో టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్ని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ళూరి సుధాకర్, కంచర్ల దయాకర్, టీ.మోహన్‌రావు, కే.సుధాకర్, విష్ణు, సురేంద్ర, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోగోలు కుమ్మరవీధిలోని చెన్నకేశవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, విశ్రాంత ఇంజినీరు గోపికృష్ణ, అమరా ట్రస్ట్ సభ్యులు ఆనందసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : హనుమజ్జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న కోదండరామాలయం ఆవరణలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, కనిగిరి రోడ్డు అయ్యప్పస్వామి ఆలయం వద్దగల ఆంజనేయ స్వామి ఆలయంలోను, కోవూరు రోడ్డులోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయం, జనార్దనస్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విఘ్నేశ్వర, వైనతేయ హనుమత్ ఆలయంలో ఉన్న స్వామివార్లకు పంచామృత అభిషేకం, విశేష అలంకారం, వడమాల ధారణతో తమలపాకులతో అర్చన చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హనుమత్ చాలీషా పారాయణం చేయగా తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలిగిరి : మండలంలోని కలిగిరి, కమ్మవారిపాలెం, జిర్రావారిపాలెం తిప్పప్రాంతాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఆలయాల వద్ద స్వామివారికి జరిగిన అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కందుకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు దర్శించుకున్నారు. నాగేశ్వరరావుకు గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. అనంతరం హనుమజ్జయంతి సందర్భగా వలేటివారిపాలెం, పోలినేనిపాలెం గ్రామాల్లోని ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను అంజనేయులు, కాకుమాను హర్ష, పరిటాల భాస్కర్‌రావు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, తదితరులు ఉన్నారు. కాగా హనుమజ్జయంతి సందర్భంగా శనివారం స్థానిక దక్షిణముఖ ప్రసన్నాంజనేయస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామస్థులు స్వామివారి ఆలయాన్ని సింధూరం తో అలంకరించారు. రకరకాల విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారిని గజమాలతో అలంకరించారు. గ్రామస్థులతోపాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పొంగళ్లు పెట్టుకొని, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.. భక్తులకు దాతలు అన్నదానం చేశారు.

కొండాపురం : హనుమజ్జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని భీమవరప్పాడు, మర్రిగుంట తదితర గ్రామాల్లోని ఆంజనేయుడి విగ్రహాలవద్ద భక్తులు విశేష పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ చేపట్టారు. అలాగే తూర్పుపాలెంలోని కోదండరామాలయంలో శనివారం సీతారాములకు ఘనంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. ఈసందర్భంగా ఉభయకర్తలు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆత్మకూరు : ఆత్మకూరు సమీపంలోని హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ హనుమజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 5గంటలకు పంచామృతాభిషేకం, సహస్రనామపూర్వక ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయ ణంను నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణం చేపట్టారు. ఉభయకర్తలుగా సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పంటవీధిలోని రామాలయం, ఆర్యవైశ్య కోదండరామస్వామి దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సుందరమ్మ ఆలయ ఆవరణలో వెలసిన కోదండరామాంజనేయస్వామికి చందనాలంకారం, లక్షపత్ర సామూహిక ఆకుపూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కరటంపాడు, దేపూరు, వాసిలి గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలను జరిగాయి.

చేజర్ల: మండలలోని నాగులవెల్లటూరులో జరిగిన వేడుకల్లో టీడీపీ నాయకులు వేలూరు కేశవచౌదరి, చేజర్ల పీఏసీఎస్ అధ్యక్షులు వీరరాఘవరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

సంగం: మండలంలోని జండాలదొరువు కొండమీద వెలసిన అభయాంజనేయస్వామికి అభిషేకాలు, హోమం నిర్వహించారు. సంగంలోని వీరాంజనేయస్వామికి పూలంగి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం దువ్వూరులో భక్తులు హనుమాన్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కోటేశ్వరస్వామి ఆలయం నుంచి ముంబాయి జాతీయ రహదారి దువ్వూరు క్రాస్ రోడ్డు వద్ద నున్న ఆంజనేయస్వామి విగ్రహం వరకు నిర్వహించారు.

అనంతసాగరం: ఉప్పలపాడు, సోమశిల, అగ్రహారం, రేవూరు, అనంతసాగరం గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతేక పూజలు, అన్నదానం చేశారు.

ఉదయగిరి: పట్టణశివారు ప్రాంతం దుర్గంపల్లికి వెళ్లే మార్గంలో హనుమాన్‌నాలా, కుర్రపల్లి కాశినాయనగడ్డ వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాయాకర్పూరం అందజేసి హోమాలు నిర్వహించారు. హనుమాన్‌నాలా వద్ద బ్రహ్మారెడ్డి భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), వెంకటంపేట రోడ్డుపై వెలసిన వీరాంజనేయస్వామి ఉత్సవాల్లో వేదపండితులు స్వామికి అభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి వదిలారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీతారామపురం : మండలకేంద్రంతో పాటు ఓగూరువారిపల్లి, దేవిశెట్టిపల్లిలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. ఓగూరువారిపల్లిలో అభయ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు.

వింజమూరు: పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి పట్టణంలో ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


ఆత్మకూరు : ఆంజనేయస్వామి సమేత సువర్చలాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


సంగం : జంగాలదొరువులో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు


ఉదయగిరి రూరల్ : వెంకటంపేటలో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి, ఉదయగిరిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


బిట్రగుంట : పూజలు నిర్వహిస్తున్న మాలేపాటి సుబ్బానాయుడు

నిత్యం కోతలు.. ప్రజలకు వెతలు

● ఉక్కపోతకు గురవుతున్న జనం

చేజర్ల, జూన్ 1: మండలంలో కొన్నిరోజులుగా అప్రకటిత విద్యుత్ కోత లతో ప్రజలు అల్లాడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియక సతమతం అవుతున్నారు. అసలే ఎండ వేడిమి తట్టుకోలేక ఇంట్లో ఫ్యాన్లు, కూలర్ల వద్ద సేదతీరుదాం అంటే విద్యుత్ కోతలతో ఉక్కపోతకు గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అస్వస్థతకు గురవు తున్నారు. బోడిపాడు, టి.కే.పాడు, తూర్పువ ల్లి, ఆదురుపల్లి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇటీవల కురిసిన గాలివానలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు గంటల సమయం పడుతోంది. రాత్రుళ్లు అయితే కరెంటు ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి.


బోడిపాడు సమీపంలోని సబ్‌స్టేషన్

రెండేళ్లుగా ఇన్‌చార్జ్ ఏఈనే దిక్కు..

చేజర్ల మండలానికి రెండేళ్లుగా ఇన్‌చార్జ్ ఏఈనే కొనసాగుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈ పొదలకూరుకు బదిలీ కాగా ఆ ఏఈనే కొన్నిరోజులు ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. అయితే ప్రస్తుతం చేజర్ల మండ లాన్ని ఆత్మకూరు విద్యుత్ డివిజన్‌కు కేటాయించడంతో ప్రస్తుతం ఆత్మకూరు ఏఈ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారి ఇక్కడ లేకపో వడంతో కొంతమంది సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

సీతారామపురం, జూన్ 1: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించారు. మండలంలో జరగబోయే ఉపాధిహామీ పనులు, నీటి సౌకర్యం, డ్రైనేజీ, వీధిదీపాలు ఏర్పాటుపై మొక్కుబడిగా చర్చలు జరిపారు. ప్రజాప్రతినిధులు సమావేశంపై ఆసక్తి చూపించ లేదు.

మహిళ ఎంపీటీసీపై చిన్నచూపు..

సమావేశం అనంతరం సీతారామపురం-2 ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై, ఎలక్షన్ విధుల్లో ప్రభుత్వ ఉద్యోగుల పక్షపాత ధోరణిపై మాట్లాడటానికి కనీసం మైకు కూడా కేటాయించకుండా చిన్నచూపు చూశారని వాపోయారు. అధికార పార్టీకి అనుకూలంగా రేషన్ డీలర్లు, అంగన్వాడి సిబ్బంది ఎన్నికల ప్రచారంలో సాక్షాధారాలతో దొరికినా ఎంపీడీవో చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. మహిళ ఎంపీపీగా ఉండి ఒక మహిళ ఎంపీటీసీగా తాను మాట్లాడుతున్నప్పుడు కనీసం మైకు కూడా ఇవ్వకుండా మిగిలిన ఎంపీటీసీలకు మాట్లాడేందుకు మైక్ సౌకర్యం కల్పించడం ఎంతవరకు సమంజమన్నారు.



అనంతసాగరం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

మొక్కుబడిగా సమావేశం

అనంతసాగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సమావేశం మొక్కుబడిగా సాగింది. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు కొంతమంది మాత్రమే హాజవరగా మౌలిక వసతలు, ఉపాధిపనులు, తాగునీటి ఎద్దడి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.

వైభవంగా అశ్వవాహనసేవ

సంగం, జూన్ 1: తరుణవాయి చెన్నకేశవస్వామి అశ్వవాహనసేవ శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అశ్వావాహనంపై ఉంచి గజమాలలతో అలంకరించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

విధుల్లో చేరిన ఎంఈవో

అనంతసాగరం, జూన్ 1: మండల ఎంఈవో-1గా సంగం విద్యాధికారి జానకిరాం శనివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎంఈవో బాలకృష్ణారెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వచ్చారు.

డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు

అనంతసాగరం, జూన్ 1: పదోతరగతి, తత్సమాన పరీక్షలో ఉతీర్ణులైన అభ్యర్థులు 2024-25 విద్యా సంవత్సరం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు వారు అందించే డిప్లోమా కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమశిల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పల్లంరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 20వరకు ఉందన్నారు.

శ్రీవారి సేవలో కాకర్ల సురేష్


శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల టీడీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే అభ్యర్థులు

వింజమూరు, జూన్ 1: తిరుపతి వెంకటేశ్వరస్వామిని శనివారం ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ దర్శించుకున్నారు. బ్రేక్ దర్శనంలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, గూడూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్, ఎమ్మెల్సీ బీ.రాంభూపాల్ రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై ఏజెంట్లకు అవగాహన

ఉదయగిరి రూరల్, జూన్ 1: ఈ నెల 4న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కౌంటింగ్, ఎన్నికల, అభ్యర్థుల ఏజెంట్లకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెప్రహాబాబు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటాయించిన టేబుల్ వద్దే ఏజంట్ ఉండాలన్నారు. కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వచ్చేంతవరకు ఏజెంట్లు బయటకు పంపకూడదన్నారు. మద్యం సేవించి కౌంటింగ్ కేంద్రంలోకి రాకూడదన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను ఎలా కౌంటింగ్ చేస్తారో వివరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమనిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి, కలిగిరి ఎస్‌ఐలు వేల్పుల గిరిబాబు, ఫిరోజ్, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు

ఉదయగిరి రూరల్, జూన్ 1: ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు హెచ్చరించారు. శనివారం ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్‌ను పర్యవేక్షించి మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా పోలీస్‌యాక్ట్, 144సెక్షన్, ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. జీ.చెరువుపల్లి, గంగిరెడ్డిపల్లి, బండగానిపల్లిలతో పాటు వైసీపీ, టీడీపీ కార్యాలయాలు, ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. సీఐ, ఎస్‌ఐల మొబైల్ టీంలు ఏర్పాటు ఉంటాయన్నారు. ఉదయగిరి పట్టణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో శాంతిభద్రతల పరిరక్షిస్తామన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 12,44,761

వలేటివారిపాలెం, జూన్ 1 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 12,44,761 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,500, కుంకుమార్చన ద్వారా రూ. 26,040, వివాహాల ద్వారా రూ 1000, తలనీలాల ద్వారా రూ. 71,825, వాహనపూజల ద్వారా రూ. 4,120, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,43,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 520, రూముఅద్దెల ద్వారా రూ. 32,990, కవర్ల ద్వారా రూ. 8,100, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,10,630, అన్నదానం ద్వారా రూ. 4,78,936, విరాళాల ద్వారా రూ 60 వేలు లభించింది.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఉలవపాడు, జూన్ 1: మండలంలోని కృష్ణాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతడి వద్ద నుంచి 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. కౌంటింగ్ వేళ ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ఉండేందుకు గ్రామంలో శనివారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన నక్కా చిన నరసింహులు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించామని ఎస్‌ఐ చెప్పారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాదయాత్రకు పోలీసుల అభ్యంతరం

కావలి, జూన్ 1 : కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని, చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతూ టీడీపీ నేత తిరువీధి ప్రసాద్ నిర్వహించనున్న పాదయాత్రకు శనివారం పోలీసుల అభ్యంతరం తెలిపారు. దీంతో యాత్రకు బ్రేక్ పడింది. స్థాని కచ్చేరిమిట్టలోని వేంకటేశ్వరాలయం నుంచి బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు శనివారం ఉదయం పాదయాత్ర చేపట్టనున్నట్లు ముందుగా ఆయన ప్రకటించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాదయాత్రకు అనుమతిలేదని పోలీసులు తెలిపారు. దీంతో ప్రసాద్ తన యాత్రను వాయిదా వేసుకున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 52 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

కావలి: స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 52 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కరస్పాండెంట్ జీ. రాజకుమార్ చౌ దరి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్లేస్‌మెంట్స్‌లో 192 మంది పాల్గొనగా, 52 మందిని ఎంపిక చేశారన్నారు. వారికి వార్షిక వేతనం రూ.3 లక్షలు వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ సుమిత్‌కుమార్, అనీల్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సోమవారం కూడా ప్లేస్‌మెంట్ ఎంపికలు ఉంటాయన్నారు.

చంద్రబాబును కలిసిన చల్లా శ్రీనివాసరావు

కందుకూరు, జూన్ 1: ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు శనివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయన తనయుడు రవీంద్రనాథ్‌తో కలిసివెళ్లిన శ్రీనివాసరావు ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో ఎన్నికల తీరును బాబుకు వివరించటంతోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కన్వీనర్‌గా మీరు కొనసాగితే బాగుంటుందని చంద్రబాబుకు సూచించినట్లు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.


చంద్రబాబును కలిసిన చల్లా శ్రీనివాసరావు, రవీంద్రనాథ్

డాక్టరేట్లు సాధించడం హర్షణీయం

కందుకూరు, జూన్ 1: సేవాగుణం కలిగిన ముగ్గురు వ్యక్తులకు గౌరవ డాక్టరేట్ లభించటం హర్షనీయమని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టరు కంచర్ల రామయ్య పేర్కొన్నారు. పట్టణంలో సామాజిక సేవా విభాగంలో చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులు, వల్లూరి కోటేశ్వరరావులు గౌరవ డాక్టరేట్లు అందుకున్న సందర్భంగా శనివారం కళాశాలలో వీరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సమాజంలో సేవ చేసేవారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టరు తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావంతో ముందుకుసాగాలన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్వీ తదితరులు మాట్లాడారు.



డాక్టరేట్లు పొందిన కేశవ, కోటేశ్వరరావు, శ్రీనివాసులును సత్కరిస్తున్న కంచర్ల రామయ్య తదితరులు

పగిలిన మంచినీటి పైపులైన్లు : పట్టించుకోని అధికారులు

లింగసముద్రం, జూన్ 1: పగిలిన మంచినీటి పైపులైన్లను అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు.మండలంలోని పెంట్రాల గ్రామంలోని తాతాహోటల్ సెంటర్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కనే ఉన్న చుండి-చెర్లోపాలెం నీటిపథకం ప్రధాన పైపులైన్, గుడికి సమీపంలోని మరో పైపులైను శుక్రవారం మధ్యాహ్నం పగిలిపోయాయి.విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గోతులు తీస్తుండగా ఈపైపు లైన్లు పగిలి పోయాయని కాలనీవాసులు చెప్పారు. అక్కడే ఉన్న విద్యుత్ కాంట్రాక్టర్‌ను, మంచినీటి సిబ్బందిని అడగ్గా తాము వాటిని బాగు చేయిస్తామని చెప్పారని వారు తెలిపారు.అయితే వారు పట్టించుకోలేదని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.వారు కూడా స్పందించ లేదని చెప్పారు. దీంతో తాము, పశువులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కనే పగిలిన మంచినీటి పైపులైన్

వలేటివారిపాలెంలో కుక్కల బెడద

వలేటివారిపాలెం, జూన్ 1: స్థానిక బస్టాండు సెంటరులో కుక్కల బెడదతో గ్రామస్థులు హడలిపోతున్నారు. బాబోయ్ ...కుక్కలంటూ అటు వైపు వెళ్లాలంటే వాహనదారులు సైతం భయపడిపోతున్నారు. బస్టాండు సెంటరులోని చికెన్ దుకాణాల వద్ద వీధికుక్కలు చికెన్ వ్యర్థాలు తిని రహదారులపై వెళ్లే వాహనాలు వెంట పడుతున్నాయి. అంతేకాక చిన్నపిల్లల చేతుల్లోని తినుబండారాలను లాక్కెళ్లి దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిళ్ల రోడ్లపై గుంపులుగా చేరి పాదచారులపై దాడి చేస్తున్నాయి. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకుపోయినా సమస్యను వారు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోయారు. కుక్కలబెడదతోపాటు కోతుల బెడద కూడా ఎక్కువగా ఉందని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటి నియంత్రణపై దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

హనుమజ్జయంతి ఉత్సవాల ప్రారంభం



ముత్తుకూరు : ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



బుచ్చిరెడ్డిపాళెం: పెనుబల్లిలో ఆంజనేయస్వామికి హోమాలు, పూజలు చేస్తున్న పండితులు



మనుబోలు : ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

ముత్తుకూరు, జూన్ 1: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం ఆలయ ప్రధానార్చకులు నారాయణం రామకృష్ణమాచార్యులు, అవినాష్ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, సుందరకాండ పారాయణంతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ భక్త బృందం హనుమ ప్రీతిపాత్రమైన శ్రీరామ జయరామ.. దివ్యనామ యజ్ఞం ఏకాహ దీక్ష నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు ప్రతిరోజు స్వామివారికి విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, పదో తేదీ రాత్రి గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కోవూరు : స్థానిక మందబయలు కూడలిలోని పురాతన వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జనార్దనం నాగరాజాచార్యులు 11 రకాల ఫలాలతో అభిషేకం చేశారు. శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో హనుమత్ గాయత్రీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తిచేశారు. ఈ సందర్భంగా పట్టణంలో హనుమత్ గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు హనుమంతుని ప్రతిమతో కూడిన వెండి డాలర్లను భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో పూజారులు సుబ్బయ్య, నందకుమార్, జయప్రకాశ్, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలో వాడవాడలా రాములోరి మందిరాలు, ఆంజనేయస్వామి ఆలయాలలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చి కోదండరామస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి, జొన్నవాడలోని శ్రీవరదరాజస్వామి ఆలయంలో దక్షిణముఖ ఆంజనేయస్వామికి, పెనుబల్లిలోని ఆంజనేయస్వామికి, పంచేడు, రేబాల, దామరమడుగు, పురంధరపురం, రెడ్డిపాళెం, కాళయకాగొల్లు, శ్రీరంగరాజపురం, విలియమ్స్‌పేట, నాగమాంబాపురం, కట్టుబడిపాళెం, నాగాయగుంట తదితర గ్రామాలలోని ఆలయాలలో ఆంజనేయస్వామికి ఉదయం పాలు, పంచామృతాభిషేకాలు, వడమాలలు, తులసి, తమలపాకుల మాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పెనుబల్లిలో వెంకటశేషారెడ్డి, పద్మమ్మలు ఆంజనేయస్వామికి ఉదయం హోమాలు, పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జొన్నవాడలో రాత్రి గ్రామోత్సవంలో ఊరేగుతూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాలెం, కొడవలూరులో ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్త్ రాజుపాలెం గ్రామంలో జాతీయ రహదారిపై ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే కొడవలూరులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో రాత్రి అన్నదాన కార్యక్రమం జరిగింది.

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్, కేఆర్‌నగర్‌లో వున్న ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం, తీర్థప్రసాద వినియోగం జరిగింది.

మనుబోలు: మండలంలోని మనుబోలు, యాచవరం, కొమ్మలపూడి, లక్ష్మీనరసింహపురం, చెర్లోపల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలలో అభిషేకాలు, ఆకు పూజలు, సింధూరాభిషేకాలు, కుంకు మార్చనలు, చందనాలంకరణలు నిర్వహించారు. యాచవరంలోని రెండు అభయాంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు.

సైదాపురం: హనుమజ్జయంతి వేడుకలు మండలకేంద్రంతో పాటు చాగణం, గులించెర్ల, తుమ్మలతలుపూరు, కలిచేడు, కట్టుబడిపల్లి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజాలంకరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 1: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని కళాశాల వద్ద శనివారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా మూడంచెల భద్రతతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద పోలీసు యాక్ట్ 30, 144 సెక్షన్లు అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా తిరగకూడదని హెచ్చరించారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు వెల్లువడిన తర్వాత గెలుపొందిన అభ్యర్థులు వారి మద్దతుదారులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధిరులను ఆదేశించారు. పోలీసు ఆకాంక్షలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

'వాత్సల్య'లో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1 : నగరంలోని వాత్సల్య ఆనాథ శరణాలయంలో నెల్లూరు స్పెషల్ బ్రాంచి సబ్‌ఇన్‌స్పెక్టర్ తక్కోలు వెంకటేశ్వర్లు తన సతీమణి తక్కోలు విజయలక్ష్మి జ్ఞాపకార్థం శనివారం అన్నదాన కార్యక్రమం చేయించారు. అన్నదానంతో పాటు చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ జిల్లా ఛైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, మానవ సేవయే మాధవ సేవ నిర్వాహకురాలు అరవ పరిమళ, ప్రపుల్ల తదితరులు పాల్గొన్నారు.

రమేష్ సేవలు అభినందనీయం : డీసీవో

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1: నెల్లూరులోని డీసీ వో కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంటుగా పనిచేసి పదవీ విరమణ చేసిన అవిశ రమేష్ సేవలు ఘనమైనవని జిల్లా సహకారశాఖాధికారి గురప్ప అన్నారు. నగరంలోని ఎన్జీవో హోంలో శనివారం డీసీఏవో తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఉద్యోగులు రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురప్ప మాట్లాడుతూ సహకార ఉద్యోగుల మన్ననలను చూరగొని ప్రజలకు ఇతోధికంగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీసీఏవో పసుపులేటి రామ్మూర్తి, ఏఆర్-ఏపీకోఆపరేటివ్ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అవిశ విజయ మోహన్‌రావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యం

ఇందుకూరుపేట, జూన్ 1 : కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అవ్వారు ఏడుకొండలు పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడు గ్రామంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీ జరగబోవు ఎన్నికల కౌంటింగ్‌లో దాదాపు 25వేల మెజారిటీతో ప్రశాంతిరెడ్డి గెలుపొందుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గాంధీజీ నడయాడిన పల్లెపాడు గ్రామాన్ని వేమిరెడ్డి దంపతులు దత్తత తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

కల్పవృక్ష వాహనంపై విహరించిన దేవదేవుడు



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న దేవదేవుడు

పొదలకూరు, జూన్ 1: పట్టణంలో శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలిసి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక గాయని జ్యోతి సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణంలోని నాగార్జున స్కూల్ క్లాసిక్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నృత ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

మంత్రి కాకాణిపై కేసు నమోదు చేయాలి

● ఆర్‌వోకు న్యాయవాదులతో కలిసి టీడీపీ నేతల ఫిర్యాదు



ఆర్‌వోకు వినతిపత్రం అందచేస్తున్న టీడీపీ నేతలు

వెంకటాచలం, జూన్ 1 : ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తీవ్రమైన పదజాలంతో బెదిరించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని సర్వేపల్లి ఆర్‌వో చిన్నఓబులేసుకు న్యాయవాదులతో కలిసి టీడీపీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. వెంకటాచలంలోని ఆర్‌వో కార్యాలయానికి శనివారం లింగంపల్లి గ్రామ టీడీపీ సానుభూతిపరులు భాస్కర్‌రెడ్డి, సుధీర్, యశ్వంత్‌రెడ్డిలు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రి కాకాణి పొదలకూరు మండలం లింగంపల్లి గ్రామంలో ప్రసంగించిన తాలూకు వీడియోను జతచేసి ఆర్‌వోకు అందజేశారు. వారు మాట్లాడుతూ మే 11న మంత్రి కాకాణి లింగంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఇరవై రోజుల తర్వాత తనకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని దేవుడు కూడా కాపాడలేడని తీవ్ర పదజాలంతో బెదిరించారని, ఎవరైతే ఎగిరిపడుతున్నారో వాళ్లను తాను ఖచ్చితంగా విడిచిపెట్టే ప్రసక్తేలేదని, గ్రామాల నుంచి వారిని తరిమికొడతానని బెదిరించినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కాకాణిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరినారాయణ, కేవీఆర్ నాయుడు, వెంకటేశ్వర్లు, నాయకులు రాజాయాదవ్, రాధాకృష్ణమనాయుడు, మల్లికార్జున్‌నాయుడు తదితరులున్నారు.

విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు : ఎస్‌ఐ

తోటపల్లిగూడూరు, జూన్ 1 : ఎగ్జిట్ పోల్స్ తర్వాత సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూపులలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే జిల్లా ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ జంపానీకుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ వాట్సప్ గ్రూపులో రెచ్చగొట్టే పోస్టులు పంపితే గ్రూపు అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించబోమని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కందిపప్పు, గోధుమ, రాగి పిండి పంపిణీకి మంగళం

● ప్రభుత్వంపై రేషన్‌కార్డుదారుల ఆగ్రహం

పొదలకూరు, జూన్ 1: పౌర సరఫరాల ద్వారా కార్డుదారులకు సరుకుల పంపిణీలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రతి నెలా రేషన్ సరుకుల్లో కోత విధిస్తూనే ఉంది. నిన్న, మొన్నటి వరకు అరకొరగా పంపిణీ చేసే కందిపప్పు, గోధుమ పిండి, రాగి పిండి పంపిణీని జూన్ నెలకు సంబంధించి పూర్తిగా మంగళం పాడింది. దీంతో పేదలకు పూర్తిస్థాయిలో సరుకుల పంపిణీ కలగా మారింది. చాలాకాలం నుంచి ప్రభుత్వం కందిపప్పు సరఫరా అరకొరగానే పంపిణీ చేస్తోంది. పోలింగ్ ముగిసి ఓట్ల లెక్కింపునకు సిద్ధమవుతున్న వేళ రేషన్‌లో కోతపెట్టడంపై లబ్ధిదారులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. ఇంటింటికీ రేషన్ బండి ద్వారా అరకొరగానే సరుకులను కార్డుదారులకు అందిస్తున్నారు. పంచదార, బియ్యం, గోధుమ పిండి, కందిపప్పు, రాగి పిండి సైతం కార్డుదారులందరికీ పూర్తిస్థాయిలో ఇవ్వడంలేదు. ఈనెలలోనైనా అన్ని రకాల సరుకులు ఇస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూశారు. పది మందిలో అయిదుగురికి ఇచ్చే సరుకుల పంపిణీని ఎత్తేయడంతో కార్డుదారులు తీవ్రంగా మండిపడుతున్నారు. పొదలకూరు మండలంలో 21,942 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమపిండి, రాగి పిండి పంపిణీ చేసేవారు. జూన్‌కు సంబంధించి మండలంలో బియ్యం, పంచదార మాత్రమే శనివారం నుంచి పంపిణీ చేశారు. కందిపప్పు బయట మార్కెట్‌లో రూ.180 వరకు పలుకుతోంది. నానాటికి కందిపప్పు ధర ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని స్థితి నెలకొంది. గోధుమ పిండి మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. కాగా, రేషన్‌లో కేజీ గోధుమ పిండి రూ.16.50, కేజీ కందిపప్పు రూ.67కు ఇవ్వడంతో ఎక్కువమంది లబ్ధిదారులు వీటి కోసం క్యూ కట్టేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజాపంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సన్నబియ్యం ఇస్తానని చెప్పి నేడు ముతక బియ్యంతో సరిపెడుతోంది. ఉడకని కందిపప్పు ఇస్తుండడంతో విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. అయిదేళ్లలో ఏనెలా సక్రమంగా అన్ని రకాల సరుకులు పూర్తిస్థాయిలో పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఈనెలలో వీటి సరఫరా ఎత్తివేయడంతో బియ్యం, పంచదార మాత్రమే తీసుకువెళ్లాల్సిన పరిస్థితికి ప్రభుత్వం కారణమైందని మండల వాసులు విమర్శిస్తున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

వాడవాడలా హనుమజ్జయంతి



బాలాజీనగర్ సాయిదర్బార్‌లో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 1 : నెల్లూరు నగరంలో అన్ని డివిజన్లలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం కనుల పండువగా జరిగాయి. సుజాతమ్మనగర్‌లోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, మన్యుసూక్త హోమం, విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. 1,08,000 నాగవల్లీ దళములతో సామూహిక పూజ, హనుమాన్ చాలీసా పారాయణం అన్నప్రసాద వితరణలు జరిగాయి. సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

● షైపాడుగేట్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మద్దూరు సుబ్బారావు, అరుణమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం విశేష పూలంగి సేవ అనంతరం పల్లకీసేవ కనుల పండువగా జరిగింది.



భావనారాయణస్వామి ఆలయంలో..

● పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, తమల పాకులతో భక్తులచే సామూ హిక అర్చనలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు, హనుమజ్జయంతి ఉత్స వం జరిగింది.



మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో..

● రాయాజీవీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో విఘ్నే శ్వరపూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మందాంజనేయ స్వామికి లక్ష తమల పాకులతో అర్చన, మన్యుసూక్త హోమం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మూలవిరాట్‌కు చందనా అలంకారం, సాయంత్రం సహస్ర నామ పూజ, పుష్పా లంకారాలు జరిగాయి. రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం ఒంటె వాహనంపై ఆంజనేయస్వామికి నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ సూరిశెట్టి ఉమాసురేంద్ర, ఈవో జి.దర్గయ్య పర్యవేక్షించారు.

● సంతపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 5వ తేదీ వరకు జరు గుతాయి. ఉదయం హనుమజ్జయంతి పూజలు, రాత్రి గంధర్వ వాహనంలో ఆంజనేయస్వామి ఉత్సవం జరిగింది. ఈవో జి.దర్గయ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

● నగరంలోని 3వ డివిజన్ షైపాడుగేటు వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని నారాయణ విద్యాసంస్థలు జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి ప్రారంభించి పూజలు చేశారు. అందరిపై ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్ర మంలో స్థానిక టీడీపీ నాయకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బాలాజీనగర్ సాయిదర్బార్ వద్ద హనుమాన్ జయంతి సం దర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చక స్వాములు కల్యాణ ఘట్టాలను వివరించారు. భక్తుల గోవింద నామాలతో ఆ ప్రాంగణం మారు మోగింది. ఈ సందర్భంగా ఉదయం సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారం, పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్త లకు అన్నదాన జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థా పకుడు మధుసాయి, సాయిదర్బార్ కమిటీ సభ్యులు పర్య వేక్షించారు.

● మూలాపేట కోనేటిమిట్ట ప్రసన్నాంజనేయస్వామి ఆల యంలో హనుమజ్జయంతి, సీతారాముల కల్యాణం జరిగింది. పొదలకూరు రోడ్డు ఆంజనేయస్వామి ఆలయంలో, మూలాపేట బెస్తపాలెం, పోలీసు కాలనీ, నవాబుపేట, ఉస్మాన్‌సాహెబ్‌పేట, తదితర ప్రాంతాలలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి.

● మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో విశేష అలంకారం, పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నెల్లూరురూరల్ : నెల్లూరు రూరల్ ప్రాం తాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా వేదగిరి క్షేత్రంలో ఆంజ నేయ స్వామి గోడ ప్రతిమ వద్ద ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పొట్టేపాళెంలో హనుమంతుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్దచెరుకూరు సిరిగార్డెన్స్‌లో అభయ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పాలాభిషేకాలు, అన్నదానం చేశారు. సౌత్‌మోపూరు, ములుముడి, ఆమంచర్ల వద్ద హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హిందూ చైతన్య వేదిక నాయకులు


నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 1: బుద్ధికి, కార్యసిద్ధికి, స్వామిభక్తికి పరాక్రమానికి హనుమంతు డు నిదర్శనం. రేపటి భావి భారత పౌరులైన యువతకు హనుమంతుని గూర్చి తెలియజేసేందుకు ఆదివా రం నగరంలో హనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నా మని హిందూ చైతన్య వేదిక నాయకులు నాగశ్రీనివాస్, కాకు మురళీరెడ్డి, పీజీ మహేష్‌లు తెలిపారు. శనివారం సాయం త్రం మూలాపేట కోనేటిమిట్ట ఆంజ నేయస్వామి ఆలయంలో వారు విలేకరు లతో మాట్లాడారు. ఈ హనుమాన్ శోభాయాత్రకు ప్రజలందరూ తమ కుటుంబాలతో తరలి రావాలని కోరారు. నగరంలోని ఏసీ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు యాత్ర ప్రారంభమై కేవీఆర్ పెట్రోలు బంకు, ఆర్టీసీ బస్టాండు, వీఆర్సీ, గాంధీబొమ్మ, సుందరయ్య విగ్రహం, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట, ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్ వరకు సాగుతుందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో అయోధ్య నుంచి తెచ్చిన సీతారామ లక్ష్మణ విగ్రహాలతో దర్బారు అలంకార దర్శనం, ప్రసాదం వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్ వెంకటేశ్వర్లు, తోటపల్లి సాయి, శ్రీనివాస్, పీఎన్‌వీ సాయి, పువ్వాడి శంకరయ్య, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

6న ఇంటర్ విద్యార్థులకు

ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), జూన్ 1 : నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6వ తేదీన ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగమేళా నిర్వహి స్తున్నట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీని వాసులు ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగిన విద్యార్థులు (మ్యాథ్స్ గ్రూపు మినహా) మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియలో కాట్ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి ఇంటర్వ్యూ నిర్వ హించి అర్హులైన వారికి హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాంలో చేరేందుకు ఆఫర్ లెటర్ అందిస్తారని పేర్కొన్నారు. ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులకు ఏడాది పాటు కాలపరిమితి ఉంటుందని, తొలి 3 నెలలు మధురైలో తరగతి గదిలో శిక్షణ ఉంటుందని, చివరి 9 నెలలు అభ్యర్థి ఇంటర్న్‌షిప్ కోసం చెన్నై హెచ్‌సీఎల్ క్యాంపస్‌కి వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ సమ యంలో అభ్యర్థికి నెలకు రూ.10వేలు స్టైఫండ్ అందచేస్తారని తెలిపారు. ట్రైనింగ్ విజయవంతంగా పూర్తిచేసిన వారికి ఏడాదికి రూ.1.70లక్షల జీతం పొందవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్ అర్హతతో మిగిలిపోకుండా హెచ్‌సీఎల్ అభ్యర్థుల ఉన్నతవిద్యకు కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7780323850ను సంప్రదించాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 2 జూన్ 2024




కూటమిలో ధీమా!

● ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో ఫుల్ జోష్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ







తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో ఎన్డీఏ కూటమి పార్టీల్లో విజయం పట్ల ధీమా పెరిగింది.పేరు ప్రతిష్టలు, విశ్వసనీయత కలిగిన 24 సర్వే సంస్థలు రాష్ట్రంతో పాటు జిల్లాలో కూడా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే మెజారిటీ స్థానాలు దక్కుతాయని ప్రకటించడంతో మూడు పార్టీల శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.పయనీర్ సంస్థ విడుదల చేసిన ఫలితాలు తిరుపతి ఎంపీతో పాటు ఐదు అసెంబ్లీ స్థానాలు కూటమి ఖాతాలో వేశాయి.కేవలం రెండు స్థానాలనే వైసీపీ ఖాతాలో వేశాయి. గూడూరు, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి సీట్లు కూటమికి దక్కుతాయని, సూళ్ళూరుపేట, సత్యవేడు మాత్రం వైసీపీకి దక్కుతాయని ఆ సంస్థ ఫలితాలు చెబుతున్నాయి. పల్స్ టుడే సర్వే ఫలితాలు కూటమికి 4 సీట్లు, వైసీపీకి 3 సీట్లు దక్కుతాయని వెల్లడించాయి. గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి స్థానాలు కూటమి ఖాతాలో, సూళ్ళూరుపేట, చంద్రగిరి, సత్యవేడు స్థానాలు వైసీపీ ఖాతాలో వేశాయి. చాణక్య స్ట్రాటజీస్ సంస్థ తిరుపతి ఎంపీ సీటు వైసీపీకి దక్కుతుందని చెబుతోంది. అయితే ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 3, వైసీపీకి 2 చొప్పున దక్కుతాయని, మిగిలిన రెండు స్థానాల్లో గట్టి పోటీ వుందని చెబుతోంది. స్థానాల వారీగా శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి కూటమికి దక్కుతాయని, చంద్రగిరి, సూళ్ళూరుపేట వైసీపీకి దక్కుతాయని, తిరుపతి, సత్యవేడుల్లో గట్టి పోటీ వుంటుందని వెల్లడించింది. చాణక్య ఎక్స్ అనే సంస్థ వెలువరించిన ఫలితాలు మిశ్రమంగా వున్నాయి. తిరుపతి ఎంపీ సీటు వైసీపీ వైపు మొగ్గు వుందని వెల్లడిస్తోంది. శ్రీకాళహస్తి, తిరుపతి స్థానాలు టీడీపీకి, సూళ్ళూరుపేట, సత్యవేడు స్థానాలు వైసీపీకి దక్కుతాయని చెబుతోంది. అలాగే గూడూరులో టీడీపీ వైపు మొగ్గు కనిపిస్తుండగా వెంకటగిరి, చంద్రగిరిల్లో వైసీపీ వైపు మొగ్గు కనిపిస్తోందని ఈ సంస్థ ఫలితాలు చెబుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ కూటమి, వైసీపీ నడుమ ఒకటి రెండు స్థానాల తేడాయే కనిపిస్తున్నా రాష్ట్ర వ్యాప్తంగా కూటమికి అధికారం దక్కుతుందనే అంశం కూటమి పార్టీల శ్రేణుల్ని సంబరపరుస్తోంది.

అత్యధిక సర్వే సంస్థల మొగ్గు కూటమి వైపే!

ఇండియా టుడే, సీఎన్ఎన్ న్యూస్, ఏబీపీ న్యూస్, న్యూస్ ఎక్స్, ఇండియా టీవీ, జీ న్యూస్, బిగ్ టీవీ, పయనీర్ పోల్ స్ట్రాటజీస్ వంటి పేరున్న 24 సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ సర్వేల ఫలితాలను శనివారం రాత్రి వెల్లడించగా ఇంచుమించు వాటన్నింటి సారాంశం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధిస్తుందని చెబుతోంది. ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాల కోసం జిల్లావ్యాప్తంగా ఇటు రాజకీయ పక్షాలు, అటు ప్రజానీకం కూడా ఉత్కంఠగా వేచి చూశాయి. మెజారిటీ సంస్థల ఫలితాలు కూటమికి అనుకూలంగా వెలువడడంతో కూటమి పార్టీల నేతల్లో సంబరం నెలకొంది. ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ నడిచింది. 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో ఫలితాలు లాంఛనప్రాయమేనన్న ధీమా కూటమి పార్టీల శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. పెద్దగా ప్రాచుర్యం లేని కొన్ని సంస్థలు మాత్రమే వైసీపీకి అధిక స్థానాలు దక్కుతాయని ప్రకటించాయి. పేరున్న సంస్థలన్నీ వైసీపీ ఓటమిని నిర్ధారించగా ఆ పార్టీ శ్రేణులు డీలా పడిపోయాయి. నాయకులు పైకి బింకంగా కనిపిస్తున్నా అంతర్గతంగా గెలుపుపై అనుమానాలు పెరిగిపోయే పరిస్థితులను ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు సృష్టించాయి.

చిత్తూరులో నాలుగు కూటమికి.. మూడు వైసీపీకి..

చిత్తూరు జిల్లా విషయానికి వస్తే దాదాపు అన్ని సంస్థలూ ఒకే తరహా ఫలితాలను విడుదల చేశాయి. కుప్పం, పలమనేరు, నగరి, చిత్తూరు స్థానాల్లో టీడీపీ గెలుస్తుందని.. పుంగనూరు, పూతలపట్టు, జీడీనెల్లూరులో వైసీపీ విజయం సాధిస్తుందని చాణక్య స్ట్రాటజీస్, చాణక్య ఎక్స్ పల్స్ టుడే, సర్వే ఫ్యాక్టరీ సంస్థలు చెప్పాయి. పయనీర్ పోల్ స్ట్రాటజీ పూతలపట్టు కూడా టీడీపీకే అంటోంది. సర్వే ఫ్యాక్టరీ అయితే జీడీనెల్లూరు టఫ్ అంటోంది. మొత్తంగా జిల్లాలో సింహభాగం స్థానాలు కూటమి దక్కించుకుంటుందని సర్వేలు చెప్తున్నాయి. ప్రముఖ సంస్థ ఆరా సర్వే మాత్రం రాష్ట్రంలో వైసీపీ తిరిగి అధికారంలోకి రానుందని చెప్తోంది.

కౌంటింగుకు సర్వం సిద్ధం

● 20 నిమిషాలకో రౌండ్ ఫలితం



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, పక్కనే ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి (కలెక్టరేట్), జూన్ 1: జిల్లాలో ఓ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 4వ తేదీన తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి మీడియాకు వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే.. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుంది. అరగంట తర్వాత ఈవీఎంలోని ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఈవీఎంలతోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా సమాంతరంగా జరిగేలా 16 కౌంటింగ్ హాల్స్ సిద్ధం చేశాం. చంద్రగిరి మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాలకు 14 టేబుళ్ల ఉంటాయి. పార్లమెంటుకు కూడా ఇదే తరహాలో లెక్కింపు ఉంటుంది. చంద్రగిరికి మాత్రం పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా 20 టేబుళ్లను ఏర్పాటు చేశాం. తిరుపతి, సత్యవేడు, చంద్రగిరిలకు 20 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. సూళ్లూరుపేట, వెంకటగిరికి 22 రౌండ్లు, గూడూరు, శ్రీకాళహస్తికి 21రౌండ్లు చొప్పున ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తాం. మొదటి రౌండు ఓట్ల లెక్కింపునకు అరగంట పడుతుంది. ఆ తర్వాత 20 నిమిషాలకే ఓ రౌండు పూర్తి చేస్తాం. మధ్యాహ్నం మూడు గంటలకల్లా పూర్తిస్థాయిలో ఫలితాలు వెల్లడిస్తాం. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి తిరుపతి అసెంబ్లీ పరిధిలో 4,766 ఓట్లు ఉన్నందున ప్రత్యేక గది ఏర్పాటు చేశాం. పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించి 250 టేబుళ్ల ద్వారా 164 రౌండ్లలో ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తాం. తిరుపతి పార్లమెంటు పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 19,503 ఓట్లు పోలవడంతో మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ఒక్కో టేబుల్‌కు ఏఆర్వో నేతృత్వంలో నలుగురు సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు. ఓట్ల లెక్కింపునకు రెండువేల మంది ఉద్యోగులను నియమించాం. వీరికి ఇప్పటికే రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చాం. ప్రతి రౌండు ఫలితాలు మీడియాకు ఎప్పటికప్పుడు చేరవేస్తాం. ఈసీ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రంలోకి మొదట గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లకు అనుమతిస్తాం. స్థలాభావం దృష్ట్యా ఎంతమందికి అవకాశం ఉంటే అంతమందికి అనుమతి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు గొడవలు చేసినా.. ఆటంకం కల్గించినా కేసు పెట్టి, జైలుకు పంపుతాం' అని కలెక్టర్ స్పష్టం చేశారు.

కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతించం: ఎస్పీ

కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. కౌంటింగ్ దృష్ట్యా 2,500 మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు ముగిశాక బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిషేధించామని, అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు కంపెనీల సాయుధ బలగాలు, అదనపు పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందన్న విషయాన్ని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు పెట్టండి

● కౌంటింగ్ ప్రక్రియ పూర్తి బాధ్యత ఆర్వోదే
● అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించి, అల్లర్లు సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలపై కలెక్టరేట్‌లో శనివారం ఆర్వోలు, పోలీసు అధికారులతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పోలీసు అబ్జర్వర్ సరితతో కలిసి సమీక్షించారు. పోలింగ్, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారి(ఆర్వో)నే వహించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రపరిధిలో డ్రోన్ ఫ్లయింగ్ నిషేధం అమల్లో ఉందని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'పోస్టల్ బ్యాలెట్' లెక్కింపు పక్కాగా ఉండాలి: జేసీ

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా ఉండాలని సిబ్బందికి జాయింట్ కలెక్టర్ ధాన్యచంద్ర సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం కౌంటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉదయం ఎనిమిది గంటలకే లెక్కింపు ప్రారంభం అవుతుందని, 25 ఓట్లు చొప్పున కట్ట కట్టాలని, ప్రతి టేబుల్‌కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కమిషనర్ అదితిసింగ్, పోస్టల్‌బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ సుశీలాదేవి, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల ఏజెంట్లకు ఆల్కహాల్ టెస్ట్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1: కౌంటింగ్ కేంద్రంలోకి ఏజెంట్లతోపాటు ఎవరైనా మద్యం తాగి వస్తే మాత్రం జైలు పాలుకాక తప్పదని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఈ క్రమంలో ఏజెంట్లను బ్రీత్ అనలైజర్లతో తనిఖీ చేశాకే కౌంటింగ్ హాలులోకి అనుమతించనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా పోలీసులను నియమించనున్నారు.

రేపు సాయంత్రం నుంచి మద్యం బంద్

సోమవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు మూడ్రోజులపాటు మద్యం షాపులు, బార్లు బంద్ కానున్నాయి. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం అన్ని మద్యం షాపులకు సీల్ వేస్తామని ఎక్సైజ్ అధికారి పేర్కొన్నారు.

ట్రయల్ రన్‌లో వెలువడ్డ విషవాయువు

● సీఎంఆర్ ఫ్యాక్టరీలో 35మంది కార్మికులకు అస్వస్థత



బాలాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా కార్మికులు

రేణిగుంట, జూన్ 1 : విషవాయువులు పీల్చి 35మంది కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటన ఏర్పేడు మండలంలో శనివారం చోటు చేసుకుంది. కార్మికుల కథనం మేరకు... చింతలపాళెం టోల్‌ప్లాజా-రాజులపాళెం మధ్య సీఎంఆర్ ఏకో అల్యూమినియం కర్మాగారాన్ని త్వరలో ప్రారంభించేందుకు యంత్రాల పనితీరుపై వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం కర్మాగారంలో అల్యూమినియం ముక్కలను కరిగించే యంత్రంలో మంట అధికంగా మండించేందుకు ప్లాస్టిక్ ఖాళీ డబ్బాలను ఉపయోగించారు.వరిపైరుకు వాడే మోనోక్రోటోఫాస్ పురుగు మందు డబ్బా నిప్పుల్లో వేయడంతో అది పగిలి అందులో ఉన్న రసాయనాలు అక్కడ పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. నిమిషాల వ్యవధిలో రసాయనాల వాసన చుట్టూ వ్యాపించడంతో విధుల్లో ఉన్న కార్మికుల్లో కొంతమంది అవి పీల్చి కళ్లు తిరిగి పడిపోగా మరికొంత మంది అస్వస్థతకు గురయ్యారు. వారందరినీ హుటాహుటిన కర్మాగారం బస్సులో సమీపంలోని బాలాజీ ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన వారిలో 25మంది మహిళలుండగా పదిమంది పురుషులు ఉన్నారు.సగం మంది మధ్యాహ్నం 2గంటలకు కోలుకోవడంతో ఇంటికి పంపారు. మరికొందరిని అబ్జర్వేషన్‌లో ఉంచి సాయంత్రం పూర్తిగా కోలుకోవడంతో ఇంటికి పంపారు.తిరుపతి ఎంపీ గురుమూర్తి చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

2,41,946 మందికి సామాజిక పింఛన్ల పంపిణీ



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 1: జిల్లాలో మే నెలకు సంబంధించి సామాజిక పింఛన్లు శనివారం 2,69,684 మందికిగాను 2,41,946 మందికి పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ ప్రభావతి తెలిపారు. ఇక మంచానికే పరిమితమై బ్యాంకుల వద్దకు రాలేని వృద్ధులు, ఇతర జిల్లాలో బ్యాంకు ఖాతాలున్న వారికి 73,819మందికిగాను 59,466మందికి పంపిణీ చేశామన్నారు. 1,82,480మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛను నగదు జమైందని, 13,385మందికి జమ కావాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు.

బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు

శనివారం మధ్యాహ్నం పైనుంచి సాయంత్రం వరకు కూడా చాలామంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాలేదు. మరోవైపు వృద్ధులు నగదు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి 9.30గంటలకు 90శాతం మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమైనట్లు అధికారులు తెలిపారు. రెండో రోజు ఆదివారం, బ్యాంకులకు సెలవు కావడంతో పింఛనుదారులు నగదు తీసుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వం తీరుపై పింఛనుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిని చూసేందుకు వెళుతూ తనయుడి మృతి

● బైక్ ప్రమాదంలో తండ్రికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 1:అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు తండ్రిని తీసుకెళ్తున్న ఓ ఇంజనీరింగు విద్యార్థి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేట పట్టణం సాయినగర్‌లో నివాసం ఉంటున్న శరత్‌కుమార్ రెడ్డి భార్య పవిత్ర అనారోగ్యంతో గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.శనివారం శరత్‌కుమార్‌రెడ్డి తన కుమారుడు హర్షిక్(21)తో కలిసి భార్యను చూసేందుకు బైక్‌పై గూడూరుకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని పండ్లూరు సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న లారీ బ్రేక్ వేయడంతో హర్షిక్ నడుపుతున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షిక్ మృతి చెందగా శరత్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శరత్‌కుమార్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.



సంఘటనా స్థలంలో పడివున్న తండ్రీకొడుకులు - (ఇన్‌సెట్‌లో) హర్షిద్

తిరుపతిలో చిరుజల్లులు





ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం

తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా వడగాడ్పులు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు కొంత ఊరట లభించింది. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన చిరు జల్లులు తిరుపతిలో కురిశాయి. రుతుపవనాల ప్రభావంతో రాత్రి 10 గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.ఉక్కపోతతో అల్లాడిపోతున్న వారికి ఉపశమనాన్ని కలిగించింది. మరోవైపు ఆకాశంలో మిరుమిట్లు గొలిపే మెరుపులు, వాటి వెంటే పెద్ద శబ్దాలు చేస్తూ ఉరుములు ఒకింత భయాందోళన కల్గించాయి. పాకాల మండలంతో పాటు పలు ప్రాంతాల్లో ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



గూడూరు చెన్నకేశవ ఆలయంలోని హనుమంతుడికి వడల అలంకరణ- చిల్లకూరు అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు - ప్రత్యేక అలంకరణలో వెంకటగిరి పాతకోట వీరాంజనేయస్వామి - సూళ్లూరుపేటలో బాలాంజనేయస్వామికి తమలపాకుల లక్షార్చన - నాయుడుపేటలోని అగ్రహారపేట ఆంజనేయుడికి అభిషేకం

గూడూరు, జూన్ 1: పట్టణంలోని పలు ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో హనుమంతుడిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అష్టోత్తర శతసహస్ర నాగవల్లీ దళ సామూహిక పూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం తదితరాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం జరిగింది. సిరామిక్ కళాశాల రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, చెన్నకేశవస్వామి ఆలయంలో, తమ్మిశెట్టిగుంట ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాళవ్యానగర్‌లోని శ్రీరామ రక్షా కుటీరంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీరామపట్టాభిషేకం, పుష్పయాగం పూజా కార్యక్రమాలను జరిపారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 5వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు దీవి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు హనుమంతుడికి లక్ష తమలపాకులతో అర్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి భక్తులచే లక్ష తమలపాకులతో అర్చన చేశారు. అదే విధంగా చెంగాళమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సహాయ కమిషనర్ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎం.వెంకటేశ్వర్లు రెడ్డి, ఐ.శ్రీధర్, కె.శ్రీరామ్మూర్తి సహా ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సింధూరంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సహస్రనామార్చన, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయ దాతలుగా అమర్‌నాథరెడ్డి దంపతులు వ్యవహరించారు.

చిల్లకూరు: మండలంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.చిల్లకూరులోని అభయాంజనేస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిపారు. అదేవిధంగా కలవకొండ, ఏరూరు, కడివేడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిపారు. కలవకొండలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: మండలంలోని వంజివాక, గూడలి, దక్షిణ పాలెం, కేశవరం గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంజనీపుత్రుడి జయంతి సందర్భంగా ఆయా గ్రామాల్లోని విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదానం జరిగింది. ఆంజనేయస్వామి చిత్రపటాలతో గ్రామోత్సవాలు జరిగాయి.

వెంకటగిరి టౌన్: పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలు స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1116 హనుమాన్ జెండాలు, స్టిక్కర్లు పంపిణీ చేయడమేకాకుండా అన్నదానం చేసినట్టు ఏపీపీ ప్రకృతికుమార్ చెప్పారు. అదే విధంగా పాతకోటలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించాల్సిన హనుమజ్జయంతి ర్యాలీ ఎన్నికల కోడ్ కారణంగా 9వ తేదికి వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడికి శాశ్వత అంగవైకల్యం

ఆసుపత్రిలో 12 రోజులుగా చికిత్స ● రెండు కాళ్లు తీసేసిన వైద్యులు



చికిత్స పొందుతున్న భరత్‌కుమార్

పెళ్లకూరు, జూన్ 1: విద్యుదాఘాతం కారణంగా ఓ బాలుడికి శాశ్వత అంగ వైకల్యం ఏర్పడింది. పెళ్లకూరు మండలం చిల్లకూరు దళితవాడకు చెందిన నెలబల్లి మహేష్, భువనేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. మహేష్ ఆటో డ్రైవర్. వేసవి సెలవులు కావడంతో 9వ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు భరత్‌కుమార్ కాలనీ సమీపంలో గత నెల 19న పిల్లలతో కలసి క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో బాల్ సమీపంలోని పాత పరిశ్రమ ఆవరణలో పడింది. దాన్ని తెచ్చేందుకు భరత్ కుమార్ ప్రహరీని ఎక్కి దాటే సమయంలో కిందకు వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదా ఘా తానికి గురయ్యాడు. దీంతో బాలుడి రెండు కాళ్లు, చేతులు కాలి పోయాయి. తల్లిదండ్రులు బాలుడిని చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలో భాగంగా శనివారం వైద్యులు భరత్‌కుమార్‌కు రెండు కాళ్లు తొలగించారు. దీంతో పద్నాలుగేళ్లకే శాశ్వత అంగ వైకల్యం చెంది మంచానికే పరిమితం కానున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో జరిగిన ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేపల మార్కెట్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాత్కాలిక చేపల దుకాణాలు

గూడూరు, జూన్ 1: పట్టణంలోని ఐసీఎస్‌రోడ్డులో తాత్కాలిక చేపల మార్కెట్‌లో శనివారం వేకువ జామున అగ్నిప్రమాదం జరిగి నాలుగు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య వివరాల మేరకు... మార్కెట్‌లో మంటలు చెలరేగడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే తమకు సమాచారం అందించారన్నారు. దీంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశామన్నారు. ఈ ప్రమాదంలో గోపికృష్ణ, బుజ్జమ్మ, పద్మమ్మ, శేషమ్మకు చెందిన దుకాణాలు దగ్ధమయ్యాయన్నారు. సుమారు రూ.8లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గూడూరు అర్బన్, జూన్ 1: మండలంలోని నెల్లటూరు గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. మృతదేహంపై నలుపురంగు నిక్కరు ఉంది. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడికి బీదా పరామర్శ

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



వెంకటేశ్ యాదవ్‌ను పరామర్శిస్తున్న బీదా తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 1: టీడీపీ సానుభూతి పరుడు వెంకటేశ్ యాదవ్ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందిస్తామని టీడీపీ జాతీయ కార్యదర్శి బీదా రవిచంద్ర భరోసా ఇచ్చారు. గత ఏడాది వైసీపీ శ్రేణుల దాడిలో తీ వ్రంగా గాయపడిన వెంక టేశ్ నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. తలకు శస్త్రచికిత్స చేయించుకుంటున్న వెంకటేశ్‌ను శుక్రవారం రాత్రి బీదా పరామర్శించారు. ప్రస్తుతం వైద్యానికి అయ్యే ఖర్చుల కు తానే అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇంకా మెరుగైన చికిత్సకు అయ్యే ఖర్చులను పార్టీ భరిస్తుందని తెలిపారు. ఆయన వెంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మేడా సాయి నారాయణ, ఆలీ బాయ్, శ్రీధర్, సత్యనారాయణ తదితరలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

తడ, జూన్ 1: రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని ఇరకంకుప్పానికి చెందిన రాజివేలు శుక్రవారం పని మీద గుమ్మిడిపూండికి వెళ్లాడు. అదే రోజు రాత్రి మెమోలో తడకు వచ్చాడు. రైల్వేస్టేషన్ రోడ్డులో నడుచుకుని వెళ్తుండగా బైక్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో రాజివేలు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనికి ప్రథమ చికిత్స అందించి చెన్నైకు తరలించారు. అలాగే స్థానిక సుజాతనగర్‌లో నివాసముంటున్న రోశయ్య శనివారం సాయంత్రం ఇంటి నుంచి స్థానికంగా ఉన్న ఓ అపార్ట్‌మెంటుకు పని మీద బయలుదేరాడు. జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని బైక్ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను కిందపడి పోవడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న కారు మరోసారి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 సిబ్బంది సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,873 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,532 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఈ విరాళం డీడీలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

పవన్‌కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవాలని..

పొర్లుదండాలతో జపాలి మెట్లెక్కిన అభిమాని



తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ ఓ అభిమాని జపాలి మెట్లను పొర్లుదండాలతో ఎక్కి అభిమానాన్ని చాటుకున్నాడు. చంద్రగిరి మండలంలోని బలిజపల్లికి చెందిన ఈశ్వర్.. పవన్‌కల్యాణ్ వీరాభిమాని. పిఠాపురం నుంచి జనసేనాని ఎమ్మెల్యేగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఈనెల 4న ఫలితాలు రానున్న నేపథ్యంలో పొర్లుదండాలతో జపాలికి చేరుకుని, ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నాడు. శనివారం హనుమజ్జయంతి కావడంతో ఉదయం 10 గంటలకు మొదటిమెట్టు వద్ద కర్పూరం వెలిగించి, పొర్లుదండాలు చేసుకుంటూ వెళ్లి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నాడు. ఈసందర్భంగా ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ భారీ విజయాన్ని అందుకోవాలని పొర్లుదండాలు చేశానన్నారు.

సూళ్లూరుపేటకు జలగండం

డెడ్ స్టోరేజీకి చేరిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్



అడుగంటిన పిండిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



నెర్రెలు బారిన ఎస్ఎస్ ట్యాంకు

సూళ్లూరుపేట, జూన్ 1: సూళ్లూరుపేటలో నీటి కష్టాలు పెరుగుతున్నాయి. పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ డెడ్ స్టోరేజీకి చేరింది. తల్లంపాడు వద్ద డైరెక్టు పంపింగ్ ద్వారా అందించే తాగునీటి పథకం అంతంత మాత్రంగానే పనిచేస్తుండడం, రూ.162 కోట్లతో నిర్మిస్తున్న నీటి పథకం పనులు నిలిచిపోవడంతో రాబోయే రోజుల్లో పట్టణంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చనుంది. 59,203మంది జనాభా ఉన్న సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో నీటి పథకాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడంపై అధికారులు,పాలకులు నిర్లక్ష్యం వహించడంతో పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ నుంచి, తల్లంపాడు చెరువు వద్ద నుంచి డైరెక్టు పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పిండిపాలెం వద్దనున్న ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం 720ఎంఎల్ అయితే ప్రస్తుతం 50 ఎంఎల్ మాత్రమే నీరు నిల్వ ఉంది.వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటిని నిల్వ చేయాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎప్పుడూ లేని విధంగా గత ఏడాది డిసెంబరులో వరదలు రావడంతో కాళంగి నదికి వరదనీరు చేరి మార్చి వరకు కూడా కాళంగికి అను సంధానమైన నెర్రికాలువలో పుష్కలంగా నీరు ప్రవహించింది. నెర్రి కాలువ నీటిని ఎస్ఎస్ ట్యాంకులోకి లిఫ్టు చేయకపోవడంతో నీటి సామ ర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది.తల్లంపాడు చెరువులో నీటి పథకాలు తరచూ మొరాయిస్తున్నాయి.సరిపడా నీటి సరఫరా లేకపోవడంతో పట్టణవాసులు నీటి అవసరాల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ ట్యాంకర్లు, మినరల్ క్యాన్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆగిన రూ.162 కోట్ల పనులు..

సూళ్లూరుపేట దాహార్తి తీర్చేందుకు ఏఐబీ సాయంతో రూ.162 కోట్లతో మంగళంపాడు చెరువులో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పట్టణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపి ప్రతి ఇంటికి తాగునీరందించాలనే లక్ష్యంతో మొదలైన పనులు మొదట వేగంగా జరిగినా తరువాత మందగించాయి.కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు మధ్యలోనే పనులు నిలిపివేసి వెళ్లారు.అయినా దీని గురించి పాలకులు, అధికారులు పట్టించుకోలేదు.

నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న అర్బన్ సీఐ

నాయుడుపేట టౌన్, జూన్ 1: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఇంటివద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సీసీ కెమెరాను అమర్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు సందర్భంగా సమావేశాలు, విజయోత్సవ ర్యాలీల నిషేధమన్నారు.



విజయశ్రీ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దొరవారిసత్రం, జూన్ 1: దొరవారిసత్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. మండల సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ డి.సుజాతమ్మ అధ్యక్షత వహించారు. తాగునీటి ఎద్దడిపై మొక్కుబడి చర్చ జరిపారు. పలువురు సర్పంచులు హాజరుకాలేదు. ఎంపీటీసీ సభ్యుల స్థానంలో వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అలాగే సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. దాంతో మండల మీట్ నియమావళిని పాటించని సమావేశంగా జరిగింది. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఉప ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయాధికారి జ్యోతిర్మయి, ఏఈ కస్తూరయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి గుంటలో పడి ఒకరి మృతి

చిల్లకూరు, జూన్ 1: మండలంలోని చింతవరం సమీపంలోని నీటిగుంటలో పడి శనివారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... చింతవరానికి చెందిన మస్తానయ్య(50) గ్రామానికి సమీపంలోని నీటిగుంట వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లాడు. ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ నీటిగుంటలో పడి మృతి చెందాడు. మస్తానయ్య ఎంతకీ ఇంటకి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా గుం టలో తేలుతుండడాన్ని గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్ నివారణకు అధునాతన వైద్య పద్ధతులు

తిరుపతి(వైద్యం), జూన్ 1 : క్యాన్సర్ నివారణకు అధునాతన వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని రేడియేషన్, సర్జికల్ ఆంకాలజీ విభాగం డాక్టర్లు ప్రాణబంధు దాస్, వినోదిని తెలిపారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో శనివారం పాథాలజీ, సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సీఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

తిరుపతి అర్బన్, జూన్ 1: అబ్బన్నకాలనీలో బుద్ధిమాంద్యం పిల్లలకు అవసరమైన శిక్షణ కేంద్రాన్ని శనివారం ఉదయం మేయర్ శిరీష ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులు, మానసిక వైద్యనిపుణులు కె.కవిత, ఎన్.భారతి ప్రసంగించగా, వైద్యులు కిషోర్, మల్లికార్జునరావు, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం డీఏవోగా గోపాలకృష్ణ



సూళ్లూరుపేట, జూన్ 1: సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయ డీఏవోగా తహసీల్దార్ కే.వీ. గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీఏవో పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సూళ్లూరుపేట తహసీల్దార్‌గా ఉన్న గోపాలకృష్ణకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు తీసుకొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, జూన్ 1: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఇన్‌చార్జి ఎస్ఐ కొండప్ప సమాచారం మేరకు.. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో కూర్చొని ఉన్న వ్యక్తి మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బతో మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. ఎరుపు రంగు లుంగీ, కాఫీ కలర్ గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని, వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతదేహన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్‌పై మొరాయించిన 108 వాహనం

తిరుపతి(వైద్యం), జూన్ 1: రేణిగుంట నుంచి తిరుపతి నగరంలోకి వస్తుండగా ఫ్లైఓవర్‌పై శనివారం ఓ 108 వాహనం మొరాయించింది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగిని డక్కిలి మండలం నుంచి స్విమ్స్ ఆస్పత్రికి తీసుకొస్తుండగా గేర్‌బాక్స్ సమస్య తలెత్తడంతో వాహనం ఆగిపోయింది. వాహనంలోని బాధితులను మరో వాహనంలో స్విమ్స్‌కు తరలించారు. అనేక 108 వాహనాలు ఇలాగే తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా, మరమ్మతులకు గురైన 108 వాహనం కిటికీల అద్దాలు కూడా వేయకుండా దాదాపు రెండు గంటలపాటు ఫ్లైఓవర్‌పై వదిలేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 207మంది

తిరుపతి(విద్య), జూన్ 1: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శనివారం 75001 నుంచి 92000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని, మొత్తం 207 మంది హాజరయ్యారని కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆదివారం 92001 నుంచి 108000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తినాయుడు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కోట, జూన్ 1: తిరుపతి జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కె.నారాయణ రావు తెలిపారు. జిల్లాలోని ఆయా గురుకులాల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా సీట్లలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 5నుంచి 15వ తేదీ వరకు గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20న ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కన్వీనర్ నారాయణరావు కోరారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్ల పంపిణీలో సీఐలు

గూడూరు, జూన్ 1: స్థానిక కోర్టు సెంటర్ బస్‌షెల్టర్ వద్ద శనివారం హనుమజ్జయంతి సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐలు రవికిరణ్, వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు బ్రాహ్మణ సేవా సంఘం ముందుకు వచ్చి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఏ.శివకుమార్, శ్రీనివాసరావు, లలితమ్మ, రామ్మూర్తి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం



కోట, జూన్ 1: మండలంలోని కొక్కుపాడులో శనివారం మూడు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన రమణయ్య, కే.రమణయ్య, మురళికి చెందిన మూడు గడ్డివాములపై గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ పీకలు వేశారు. ఒక్కసారిగా ఆయా గడ్డివాముల్లో మంటలు చెలరేగటంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే మూడు గడ్డివాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో తమకు రూ. 3.5లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

గొడవలకు దిగితే జైలుకే

డక్కిలి, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గొడవలు చేస్తే జైలుకు తరలిస్తామని డక్కిలి ఎస్ఐ చౌడయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 4వ తేదీన కౌంటింగ్ జరుగుతున్న దృష్ట్యా ఫలితాల అనంతరం ఏవరైనా గొడవలు, ఘర్షణలు, అల్లర్లకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఫలితాల అనంరం పోలీసు అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడం లాంటి కార్యక్రమాలు చేపట్ట కూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గెలుపోటములపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, కించపరిచేలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

అతిపెద్ద విజయం దిశగా కూటమి: టీడీపీ

డక్కిలి, మే 1: ఎగ్జిట్ పోల్ సర్వేలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయని తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పి.రాజేశ్వరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్, నేతలు పి.చంద్రమౌళి రెడ్డి, ఏ.సత్యనారాయణ, బీ.రాజేశ్వరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ పి. వెంకటరెడ్డి తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. కూటమి అతి పెద్ద విజయం దిశగా పయనిస్తుందని చెప్పారు. ఒకటి రెండు సర్వే సంస్థలు తప్ప మిగిలినవన్నీ టీడీపీ కూటమికి అధికారంలోకి వస్తుందని చెప్పాయన్నారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాలు చూసి ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతారన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో కూటమి పక్షాన నిలబడ్డారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు చెప్పారు.

టీడీపీ ఎన్ఆర్ఐ వెంకట్‌తేజకు సత్కారం



వెంకటతేజను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జూన్ 1: టీడీపీ సీనియర్ నాయకుడు పేరం మధుసూదన్ నాయుడు కుమారుడు, ప్రవాస భారతీయుడు వెంకటతేజకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా సత్కరించారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీకి ఓట్లు వేయించడం కోసం విశేష కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలలు, పుష్పగుచ్చాలు, శాలవాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయనున కలసి వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూధన్‌నాయుడు, సందీప్, సుబ్రహ్మణ్యంరెడ్డి, పరుశరాం, రమేష్, వెంకటేష్ ఉన్నారు.